జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

WANTED

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లాబ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

facbook.vaaradhinews.com

# వారధి

తెలుగు దిన పత్రిక

www.vaaradhinews.com

సంపుటి:1
సంచిక:08
బుధవారం,
11.09.2024



## టోల్ వసూళ్లకు గుడ్‌బై

- త్వరలో జీపీఎస్ ఆధారిత వ్యవస్థ
- ప్రయాణించిన దూరానికి మాత్రమే చెల్లింపులు
- మొదటి 20 కిలోమీటర్లు ఫ్రీ ట్రావెల్
- నిబంధనలు సవరించిన కేంద్ర ప్రభుత్వం

**వారధి, స్టేట్ బ్యూరో:**

ప్రైవేటు వాహనాల యజమానులకు కేంద్రం శుభ వార్త చెప్పింది! గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) వ్యవస్థ కలిగిన ప్రైవేటు వాహనాలు ఇకపై జాతీయ రహదారులపై రోజుకు 20 కిలోమీటర్ల వరకు ఎలాంటి టోల్ ఛార్జీ లేకుండా ఉచితంగా తిరగొచ్చని ప్రకటించింది. దాంతోపాటు వంతెనలు, బైపాస్ లేదా సొరంగాలను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు జాతీయ రహదారుల రుసుము నియమాలు, 2008 నింబంధనలను సవరిస్తూ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న టోల్‌గేట్ వ్యవస్థ స్థానంలో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్రం కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. కొత్త విధానంలో టోల్‌గేట్ దగ్గర ఆగి, ఫీజు చెల్లించాల్సిన పని లేదు. మనం ప్రయాణించిన దూరాన్ని జీపీఎస్ ఆధారంగా లెక్కించి, టోల్ వసూలు చేస్తారు. ఇందుకోసం జీఎన్ఎస్ఎస్ వ్యవస్థను ఉపయోగిస్తారు. ఇప్పుడు ఆ వ్యవస్థ కలిగి ఉన్న వాహనాల విషయంలో కేంద్రం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అనుసరిస్తున్న ఫాస్టాగ్,

## రాష్ట్రంపై రుణ భారం



- ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల చెల్లింపుకే
- కేంద్రం మద్దతు, సాయం అవసరం
- రుణాన్ని రీ కన్‌స్ట్రక్షన్ చేసే అవకాశమివ్వాలి
- కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా 50 శాతానికి పెంచాలి
- రాష్ట్రాన్ని ఆదుకుంటే కేంద్రానికి సహకరిస్తాం
- దేశంలోనే తెలంగాణ యంగ్ స్టేట్
- 16వ ఆర్థిక సంఘానికి సీఎం ప్రతిపాదనలు

***గత పదేళ్లలో చేసిన అప్పుల కారణంగా రాష్ట్రంపై రుణభారం పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశంలోనే తెలంగాణ వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని, ప్రసంగించారు.***



**వారధి, స్టేట్ బ్యూరో:**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణభారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుందని, ఇందులో బడ్జెట్ రుణాలతో పాటు ఆఫ్ బడ్జెట్ రుణాలు ఉన్నాయని గుర్తు చేశారు. గత పదేళ్లలో మౌలిక ప్రాజెక్టులకు నిధుల సమీకరణకు ప్రభుత్వం భారీగా అప్పులు తీసుకుందని అన్నారు. దీంతో ఇప్పుడు రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగం రుణాన్ని తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు, వడ్డీ చెల్లింపులు సక్రమంగా నిర్వహించకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు తమకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని 16వ ఆర్థిక సంఘాన్ని సీఎం రేవంత్ కోరారు. రుణాన్ని రీ స్ట్రక్చర్ చేసే అవకాశం ఇవ్వాలని లేదా తమకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందించాలని వేడుకున్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలన్నారు. అన్ని రాష్ట్రాల తరఫున ఈ డిమాండ్‌ను ముందు ఉంచుతున్నామన్నారు.

**ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**

ఈ డిమాండ్‌ను ఆర్థిక సంఘం నెరవేర్చితే, దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా

2 లో



## కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు

- ఆమె పోరాట స్ఫూర్తి మా అందరిలో ఉంది
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రవీంద్రభారతిలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ధరణి పేరుతో పేదలకు ఇచ్చిన భూములను లాక్కోవాలనే కుట్రలను, రైతాంగ పోరాట స్ఫూర్తితో తిప్పికొట్టామని రేవంత్ తెలిపారు. సామాజిక వేత్త కంచె ఐలయ్య సూచించినట్లుగా హైదరాబాద్ లోని కోఠి మహిళా యూనివర్శిటికి చాకలి ఐలమ్మ పేరు పెడుతామని హామీ ఇచ్చారు. చాకలి ఐలమ్మ మనమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమిస్తున్నట్లు చెప్పారు. ఐలమ్మ కుటుంబం ప్రభుత్వంలో

2 లో




## 'హైడ్రా'కు స్పెషల్ ఫోర్స్

- ప్రత్యేక పోలీస్ సిబ్బంది కేటాయింపు
- డీజీపీ కార్యాలయం కీలక ఉత్తర్వులు

**వారధి, స్టేట్ బ్యూరో:**

చెరువుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రాకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 15 సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులను కేటాయించింది. ఈ మేరకు డిప్యుటేషన్‌పై ఆదేశాలు ఇస్తూ డీజీపీ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చెరువులను కబ్జా చేసిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా పరిశీలిస్తూ కూల్చివేయిస్తున్నారు. ఈ సిబ్బంది కేటాయింపుతో ఆక్రమణల తొలగింపు చర్యలు వేగవంతం కానున్నాయి. హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలో హైడ్రా తన వ్యూహాన్ని మార్చుకుంది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై రీసర్వే చేసి కొత్తగా మార్క్ చేశాకే కూల్చివేతలకు దిగబోతుంది. ఇప్పటికే శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్న వారి జోలికి వెళ్లబోమని హైడ్రా ప్రకటించింది. కొత్తగా నిర్మించే ఆవాసాల కూల్చివేతలకు సంబంధించి బిల్డర్ల ద్వారా బాధితులకు పరిహారం ఇప్పించేలా అండగా ఉండాలని నిర్ణయించుకుంది.

## ఢిల్లీలో రాష్ట్రపతి పాలన?

- కేజ్రీవాల్‌కు షాకివ్వనున్న కేంద్రం
- రాష్ట్రపతికి బీజేపీ ఎమ్మెల్యేల వినతి
- పరిశీలించాలని హోం శాఖకు రాష్ట్రపతి ప్రతిపాదన
- ఆప్ సర్కారును కూలగొట్టేందుకు మోదీ కుట్ర
- ఢిల్లీ మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు



వారధి న్యూస్, న్యూఢిల్లీ:

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధింపుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. మద్యం పాలసీ కేసులో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలులో ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం నెలకొన్నదని, రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బీజేపీ ఎమ్మెల్యేలు వినతిపత్రం సమర్పించడం, దానిని ఆమె కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిశీలనకు పంపడంతో ఈ ఊహాగానాలు మరింత అధికమయ్యాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గత కొన్ని నెలలుగా జైలులో ఉండటంతో అభివృద్ధి కుంటుపడింది. పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తి జైలులో ఉండటం, సీఎం బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంతో ఇక్కడ రాజ్యాంగ సంక్షోభం నెలకొంది' అంటూ బీజేపీ ఆరోపించింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. కాగా, బీజేపీ ఆరోపణలపై అధికార ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా

2 లో

## మహిళలకే అందలం

- ప్రతి పనిలో వారికే మొదటి ప్రాధాన్యం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

2 లో





## రాష్ట్రానికి మరో 4 మెడికల్ కాలేజీలు

- అనుమతులిచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ
- ఒక్కో కాలేజీలో 50 సీట్లు కేటాయింపు
- మొత్తం 200 సీట్లు అందుబాటులోకి
- ఏపీలో రెండు కాలేజీలకు అనుమతి
- పట్టుబట్టి సాధించిన మంత్రి దామోదర రాజనర్సింహ



**వారధి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో నాలుగు కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. ఏపీకి రెండు కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుమతి ఇస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ఈ మేరకు పర్మిషన్లు మంజూరు చేసింది. దీంతో తెలంగాణలో మెదక్, యాదాద్రి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ కాలేజీలకు అనుమతి లభించింది. ఒక్కో కాలేజీలో 50 సీట్లు కేటాయించింది. దీంతో కొత్తగా 200 మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇదే ఏడాది తెలంగాణ లోని నాలుగు మెడికల్ కాలేజీలు ములుగు, నర్సంపేట్, గద్వాల్, నారాయణపేట్ మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.గతంలో 8 కాలేజీలకు పర్మిషన్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం దరఖాస్తు చేసింది. ఈ దరఖాస్తుల నేపథ్యంలో

2 లో

## 3 నెలల్లో కులగణన పూర్తిచేసి నివేదిక అందించండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- బీసీ కులగణనకు ప్రభుత్వం సిద్ధం
- కసరత్తు జరుగుతోందన్న అడ్వకేట్ జనరల్

**వారధి, స్టేట్ బ్యూరో:**


బీసీ కులగణన 3 నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించింది. బీసీ కులగణన చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను ఎర్ర సత్యనారాయణ అనే వ్యక్తి 2019లో ఫైల్ చేశారు. కాగా ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం మంగళవారం నాడు (సెప్టెంబరు 10వ తేదీ 2024) మరోసారి విచారించింది. బీసీ కులగణనపై సుప్రీంకోర్టు

2 లో




## భద్రాచలానికి వరద ముప్పు

- పోటెత్తుతున్న గోదావరి
- 48 అడుగులకు చేరిన నీటి మట్టం
- రెండవ ప్రమాద హెచ్చరిక జారీ
- లోతట్టు ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశాలు



**వారధి న్యూస్, భద్రాచలం:**

ఎగువ నుంచి పోటెత్తుతున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం పెరగడంతో స్నానఘట్టాలు, కల్యాణ కట్ట వద్ద చాలా మెట్లు వరదనీటిలో మునిగాయి. శబరి నది పోటెత్తడంతో భద్రాచలం దిగువన ముంపు మండలాలకు వెళ్లే ప్రధాన రహదారిపైకి నీరు చేరి పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువన శ్రీరాం సాగర్ బ్యారేజి నుంచి వరదనీరు దిగువకు విడుదల చేయడంతో మంగళవారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 5 గంటలకు 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

**అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్**

భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం మరింత పెరుగుతుందని, లోతట్టు ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. తాలిపేరు

2 లో



## ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనానికి ఓకే

- షరతులు విధించిన హైకోర్టు
- 2021 మార్గదర్శకాలు పాటించాలని సూచన
- పీవోపీ విగ్రహాలు కృత్రిమ నీటికుంటల్లో వేయాలని ఆదేశాలు

వారధి
తెలుగు దిన పత్రిక



# తెలంగాణ ప్రణాళికలు భేష్

- పట్టణాభివృద్ధికి తగిన ప్రాధాన్యం
- అదనపు రుణాల అంశాన్ని పరిశీలిస్తాం
- ఆర్థిక సంఘం చైర్మన్ పనగఢియా

**వారధి, స్టేట్ బ్యూరో:**

రుణాల రీస్ట్రక్చరింగ్ లేదా అదనపు రుణాలకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని, ఆ అంశంపై అధ్యయనం చేస్తామని 16వ కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగఢియా తెలిపారు. ఆరో రాష్ట్రంగా తెలంగాణలో కమిషన్ పర్యటిస్తోందని, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, అన్ని అంశాలను కమిషన్‌కు ప్రభుత్వం వివరించిందని చెప్పారు. రుణాలు, రుణభారం గురించి రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు బాగున్నాయని కమిషన్ చైర్మన్ అరవింద్ పనగఢియా ప్రశంసించారు. ఎక్కడైనా పట్టణాభివృద్ధిని సాధారణంగా నిర్లక్ష్యం చేస్తారని కానీ, తెలంగాణ మాత్రం పట్టణాభివృద్ధికి మంచి ప్రాధాన్యం ఇస్తోందని కితాబిచ్చారు. సెస్, సర్ ఛార్జీల్లోనూ వాటా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్రం కోరిందని పనగఢియా వెల్లడించారు.

**రాష్ట్ర ప్రభుత్వ కోరికలు పరిశీలిస్తాం: పనగడియా**

మంచి పనితీరు కనబరచిన రాష్ట్రాలకు నష్టం జరుగుతోందని, ప్రోత్సాహకం ఇవ్వాలని తెలంగాణ, కర్ణాటక కోరాయన్న ఆయన వాటిని పరిశీలిస్తామని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం డివిజబుల్ పూల్‌లో 41 శాతం నిధులు సిఫారసు చేసిందని, ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు ఇస్తున్నారని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల్లో రాష్ట్రాల, ఆయా రంగాలకు ప్రత్యేకంగా సిఫారసు చేసిన గ్రాంట్లు మాత్రమే రాలేదని, అది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని చైర్మన్ అన్నారు. అన్ని రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత తగిన సిఫారసులు చేస్తామని అరవింద్ పనగఢియా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పన్నుల ఆదాయం, గ్రాంట్ల రూపంలో రావాల్సిన మొత్తంతో పాటు రాష్ట్ర ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఇవ్వాల్సిన నిధుల అంశాన్ని రాష్ట్ర సర్కార్ ఇవాళ కేంద్ర ఆర్థిక సంఘానికి నివేదించింది. అరవింద్ పనగఢియా నేతృత్వంలోని 16వ ఆర్థిక సంఘం, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఇవాళ రాష్ట్ర ప్రభుత్వంతో సమావేశమైంది. సీఎం రేవంత్



రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఉన్నతాధికారులు మీటింగ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలు, ప్రత్యేక పరిస్థితులు కేంద్రం నుంచి అందించాల్సిన తోడ్పాటు, అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ఆర్థిక సంఘానికి వివరించింది.



# మహిళలకే అందలం

- ప్రతి పనిలో వారికే మొదటి ప్రాధాన్యం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వారధి న్యూస్, ఖిల్లా ఘనపురం:**

మహిళలకు ప్రతి పనిలో మొదటి ప్రాధాన్యతను కల్పిస్తూ, మహిళా ఆర్థిక స్వావలంబన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖిల్లా ఘనపురం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మేఘా రెడ్డి 44 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రానున్న రోజుల్లో మహిళా సంఘాలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తాయని మేఘా రెడ్డి పేర్కొన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో, ప్రభుత్వం పాఠశాల, వసతి గృహాల విద్యార్థులకు యూనిఫాంలను కుట్టించి అందించే ప్రక్రియను ఈ సంఘాలకు అప్పగించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య, వెంకట్రావు, సాయి చరణ్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి లు విజయ లక్ష్మి, మల్లేష్, మాజీ సర్పంచులు సతీష్, మార్కెట్ డైరెక్టర్ రాములు, కృష్ణయ్య యాదవ్, నాయకులు లక్ష్మారెడ్డి, రవి నాయక్, ప్రకాష్, శంకర్, శ్రీరాములు, నారాయణ, బాబు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# టోల్ వసూళ్లకు గుడ్‌బై

**తరువాయి భాగం**

ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీకి అదనంగా ఈ కొత్త విధానం అమలు కానుంది. కాగా, జీఎన్ఎస్ఎస్ ద్వారా టోల్ వసూలు చేయడానికి సంబంధించిన పైలట్ స్టడీని, కర్ణాటకలో బెంగళూరుమైసూరు జాతీయ రహదారి ఎన్‌హెచ్ 275పై చేసినట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇంతకుముందు వెల్లడించారు.

**ఎలా పనిచేస్తుందంటే?**

జీఎన్ఎస్ఎస్ ద్వారా టోల్ వసూలు చేయడానికి శాటిలైట్ ఆధారిత సాంకేతికతను ఉపయోగిస్తారు. ఈ సాంకేతిక వ్యవస్థ వాహనం కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. అనంతరం జీఎన్ఎస్ఎస్ వ్యవస్థతో కూడిన ఆన్ బోర్డు యూనిట్‌లో ఉన్న సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్, ఆటోమెటిక్‌గా టోల్ ఛార్జీని లెక్కిస్తుంది. ఆ తర్వాత ఫాస్టాగ్/డిజిటల్ వ్యాలెట్ వంటి డ్రైవర్ ప్రీపెయిడ్ అకౌంట్ల నుంచి ఆ టోల్ ఛార్జీ ఆటోమెటిక్‌గా కట్ అవుతుంది. ఈ సాంకేతికత టోల్ సామర్థ్యాన్ని పెంచుతుంది. దీని ద్వారా ట్రాఫిక్ పరిస్థితులు లేదా వివిధ రహదారులను బట్టి టోల్ ఛార్జీలను సర్దుబాటు చేసుకోవచ్చు. ఈ పద్ధతి పూర్తిగా అమలైతే మాన్యువల్ టోల్ సేకరణ అవసరం ఉండదు. దానివల్ల జరిగే ఆలస్యాన్ని అధిగమించవచ్చు.

# 3 నెలల్లో కులగణన పూర్తిచేసి నివేదిక అందించండి

**తరువాయి భాగం**




ఉత్తర్వులున్నాయని పిటిషనర్ హైకోర్టు దృష్టికి తీసుకురాగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం మూడు నెలల్లో కులగణన చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణ ముగించింది.

సమర్థంగా నిర్వహిస్తాం: బీసీ కమిషన్ చైర్మన్

బీసీ కులగణన ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల పట్ల తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ హర్షం వ్యక్తం చేశారు. కుల గణనను బీసీ కమిషన్ సమర్థంగా నిర్వహిస్తుందని తెలిపారు. కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాంపల్లిలోని యూసఫియన్ బాబా దర్గాలో నిరంజన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బీసీ కమిషన్‌కు మంచి పేరు వచ్చేలా పని చేసేందుకు యూసఫియన్ బాబా స్థైర్యం ఇవ్వాలని ప్రార్థించినట్లు వెల్లడించారు.

# రాష్ట్రంపై రుణ భారం

**తరువాయి భాగం**

మార్చాలని ప్రధాని మోదీ ఎంచుకున్న లక్ష్య సాధనకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని సీఎం తెలిపారు. తెలంగాణను తాము ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. తెలంగాణకు తగినంత సహాయం అందించాలని, అందుకు దేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో తమ వంతు బాధ్యతను నెరవేరుస్తామని వివరించారు. ఫిస్కల్ ఫెడరలిజాన్ని బలోపేతం చేయడంలో మీ మద్దతు కోరుతున్నామన్నారు. తెలంగాణ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు మీ సిఫారసులు ఉపయోగపడతాయని తాము నమ్ముతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.





# కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు

**తరువాయి భాగం**

భాగస్వామ్యంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. పోరాటస్ఫూర్తి కలిగిన వాళ్లు ప్రజా ప్రభుత్వానికి అవసరమని స్పష్టం చేశారు. చాకలి ఐలమ్మ మనుమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం భూ హక్కులను ధరణి పేరుతో లక్షల ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. అలేఖ్య పుంజాల నేతృత్వంలోని చాకలి ఐలమ్మ నృత్య నాటికను అతిథులు తిలకించారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తి తమ అందరిలో ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. మా మంత్రివర్గ సహచరుల అనుమతితో కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెడుతున్నట్లు నిర్ణయం తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



# ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనానికి ఓకే

- షరతులు విధించిన హైకోర్టు
- 2021 మార్గదర్శకాలు పాటించాలని సూచన
- పీవోపీ విగ్రహాలు కృత్రిమ నీటికుంటల్లో వేయాలని ఆదేశాలు

**వారధి, స్టేట్ బ్యూరో:**

హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జన వేడుకలపై రాష్ట్ర హైకోర్టు స్పష్టత ఇచ్చింది. 2021లో రూపొందించిన మార్గదర్శకాలనే పాటించాలని సూచించింది. మట్టి, ఎకో ఫ్రెండ్లీ విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాలను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కృత్రిమ నీటికుంటలోనే నిమజ్జనం చేయాలని ఆదేశించింది. గత రెండేళ్లలో హైకోర్టు ఆదేశాలను ధిక్కరించారని పిటిషనర్ మామిడి వేణుమాధవ్ పేర్కొన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, ధిక్కరణ పిటిషన్ ఇంత ఆలస్యంగా ఎందుకు వేశారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2021లో రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం నిమజ్జనాలు జరగట్లేదని పిటిషనర్ పేర్కొన్నారు. నిమజ్జనాల కోసం ట్యాంక్ బండ్‌పై భారీ క్రేన్లు నిలుపుతున్నారని, వీటి వల్ల ట్యాంక్ బండ్‌కు ముప్పు ఉందని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం, 2021లో రూపొందించిన మార్గదర్శకాల ప్రకారమే నిమజ్జనాలు జరపాలని తేల్చి చెప్పింది.


**కోర్టు ధిక్కరణ పిటిషన్ తిరస్కరణ**

వాదనలకు తగిన ఆధారాలను చూపించాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. గత రెండేళ్లలో మార్గనిర్దేశకాలను ఉల్లంఘించినట్లు భావిస్తే ఇంత ఆలస్యంగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి 2021లోనే మార్గనిర్దేశకాలున్నాయని, 2022లో జరిగిన విచారణ సందర్భంగా నిమజ్జనంపై పిటిషనర్‌తో పాటు హైకోర్టు సైతం సంతృప్తి వ్యక్తం చేసిందని ధర్మాసనం తెలిపింది. హుస్సేన్ సాగర్‌లో కేవలం మట్టి గణపతులు, పర్యావరణ హిత విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేయాలని మార్గనిర్దేశకాలున్నాయని పేర్కొంది. పీవోపీ విగ్రహాలను సహజ జలవనరుల్లో నిమజ్జనం చేయొద్దని ఆదేశాలు జారీచేసింది. ట్యాంక్‌బండ్ మీద నుంచి కాకుండా ఎన్టీఆర్ మార్గ్, పీవీ మార్గ్, సంజీవయ్య పార్కుల పరిసరాల్లో విగ్రహాలను నిమజ్జనం చేయాలని తెలిపింది. ఇప్పుడు జరిగే నిమజ్జనంలో కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘిస్తున్నారని భావిస్తే ఆధారాలతో సహా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్‌కు హైకోర్టు సూచించింది. ఈ మేరకు వేణుమాదవ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది.

# 15 వరకు ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల గడువు

**వారధి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు మరోసారి గడువు పొడిగించింది. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువును పొడిగించారు. ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఇదే చివరి అవకాశం అని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అధికారులు సూచించారు. ఇక ఇంటర్‌లో ప్రవేశం తీసుకోవాలనుకునే విద్యార్థులు ఇంటర్నెట్ మార్క్స్ మెమో, ఆధార్ కార్డు తప్పనిసరిగా దరఖాస్తుకు జతపరచాలి. ప్రొవిజినల్ అడ్మిషన్ పూర్తయిన తర్వాత కచ్చితంగా ఒరిజినల్ మెమోతో పాటు టీసీ సమర్పించాల్సి ఉంటుంది. ఇక ఇంటర్మీడియట్ బోర్డు చేత గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆ జాబితా ఆధారంగా అడ్మిషన్లు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.




# ఢిల్లీలో రాష్ట్రపతి పాలన?

**తరువాయి భాగం**

మండిపడుతున్నది. కమలం పార్టీ కనుసన్నల్లో రాష్ట్రపతి పనిచేస్తున్నారని ఆరోపించింది.

**ఆప్ సర్కారును పడగొట్టేందుకు కుట్ర**

ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా కేంద్రంలోని బీజేపీ, కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు దొడ్డిదారిన కుట్ర పన్నుతున్నదని ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత ఆతిశీ మంగళవారం ఆరోపించారు. ఒక వేళ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని మోదీ ప్రభుత్వం పడగొడితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మొత్తం 70 సీట్లను గెల్చుకుంటుందని, ఢిల్లీ ప్రజలు బీజేపీకి సున్నా సీట్లతో బుద్ధి చెబుతారని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, మణిపూర్ రాష్ట్రాల్లో చేసిన విధంగా ఆపరేషన్ లోటస్ ద్వారా విపక్ష రాష్ట్రాలను అధికారంలోంచి



దించేయడమే బీజేపీ పని అని ఆతిశీ విమర్శించారు. అయితే ఇదే మంత్రాన్ని బీజేపీ ఢిల్లీలో ఆప్ ఎమ్మెల్యేలను తస్కరించడానికి ప్రయోగించి విఫలయ్యిందని ఆమె అన్నారు.



# రాష్ట్రానికి మరో 4 మెడికల్ కాలేజీలు

**తరువాయి భాగం**

జూన్ మాసంలో ఎన్ఎంసీ టీమ్ తెలంగాణ వచ్చి పరిశీలన చేసి వెళ్లింది. అయితే.. ఇక్కడ కాలేజీల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు లేవని పేర్కొంటూ అనుమతి ఇవ్వలేదు. దీంతో టీచింగ్ స్టాఫ్, ఇతర సౌకర్యాల కోసం అవసరమైన నిధులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటాయించింది. ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించి ఫస్ట్ అప్పీల్‌కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెళ్లింది. దీంతో మరోసారి పరిశీలనలు చేసి ఎన్ఎంసీ ములుగు, నర్సంపేట్, గద్వాల్, నారాయణపేట్ కాలేజీలకు పర్మిషన్లు ఇచ్చింది. అయితే, మిగిలిన నాలుగు మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వలేదు. మిగిలిన నాలుగు కాలేజీలకు పర్మిషన్లు తెచ్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుదలతో పని చేసింది. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా రెగ్యులర్‌గా మానిటర్ చేశారు. స్టాఫ్ నియామకం, ఇతర సౌకర్యాల కల్పనపై ఫోకస్ పెట్టారు. అవసరమైన నిధులనూ కేటాయించారు. ఎన్ఎంసీ లేవనెత్తిన అభ్యంతరాలు, లోపాలను ఫుల్ ఫిల్ చేశారు. అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత సెకండ్ అప్పీల్‌కు వెళ్లింది కాంగ్రెస్ ప్రభుత్వం.



# భద్రాచలానికి వరద ముప్పు

**తరువాయి భాగం**

ప్రాజెక్టు నుంచి లక్షా 50 వేల క్యూసెక్కుల వరద వస్తోందని అన్నారు. ఇంద్రావతి, సమ్మక్క సారక్క బ్యారేజ్ నుంచి ప్రవాహం వస్తోందని వెల్లడించారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నుంచి దిగువకు 10,32,816 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తోంది. పట్టణంలో బ్యాక్ వాటర్‌ను ఎప్పటికప్పుడు భారీ మోటార్ల ద్వారా స్లూయిజ్‌ల వద్ద గోదావరిలోకి పంపింగ్ చేస్తున్నారు. వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

**జాగ్రత్తలు పాటించాలని అధికారులకు హెచ్చరిక**

చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరదనీటి ఉధృతి తగ్గింది. ప్రాజెక్టు 25 గేట్లను ఎత్తి 40వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గోదావరి వరద 50 అడుగులకు చేరినట్లయితే భద్రాచలం నుంచి దుమ్ముగూడెం చర్ల మండలాలకు ప్రయాణాలు నిలిచిపోయే అవకాశం ఉంది. గణేశ్ ఉత్సవాలు ముగుస్తున్న సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదికి నిమజ్జనానికి వినాయక విగ్రహాలు తెచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లుగా జిల్లా కలెక్టర్ తెలిపారు. అందుకోసం మూడు లాంచీలు, ఆరు క్రేన్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేసినట్లుగా వెల్లడించారు.





## 108 అంబులెన్స్ లో ప్రసవం, తల్లీబిడ్డ క్షేమం..

**వారధి న్యూస్, శ్రీరంగాపూర్:** మండల పరిధిలోని నాగరాల గ్రామానికి చెందిన లక్ష్మి (20) కి పురిటీ నొప్పులు రావడంతో, ఆమె కుటుంబ సభ్యులు 108 నంబరుకు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన కడుకుంట్ల అంబులెన్స్ సిబ్బంది, ఈఏంటీ నరేందర్ మరియు పైలెట్ రాఘవేంద్ర, లక్ష్మిని వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించేందుకు నిమ్మించినారు.అయితే, మార్గమధ్యంలో నొప్పులు తీవ్రంగా పెరగడంతో, లక్ష్మి అంబులెన్స్ లోనే మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ అనూహ్య సంఘటన సిబ్బందిని అతి వేగంగా స్పందించడానికి కారణమైంది. తరువాత, తల్లి మరియు పసికందును వైద్య సహాయానికి వనపర్తి ఏంసీహెచ్ ఆసుపత్రికి తరలించామని సిబ్బంది తెలిపారు. లక్ష్మి కుటుంబ సభ్యులు అంబులెన్స్ సిబ్బందికి వారి తక్షణ స్పందనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుల ఘన నివాళి



**వారధి న్యూస్, వనపర్తి:** తెలంగాణలో బహుజన కులాలకు ప్రేరణాత్మక వ్యక్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వనపర్తి జిల్లా కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న ఆమె విగ్రహానికి అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా, అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు, సంఘం తరఫున సమర్ధనకు ముందుకు వచ్చి, చాకలి ఐలమ్మకు తగిన గౌరవాన్ని ఇచ్చారు. నాయకులు పేర్కొనగా, వనపర్తి లో బీసీ నాయకుల విగ్రహాలను ప్రతిష్ఠించడంలో కష్టపడుతున్నారు. కానీ అగ్రకుల నాయకుల విగ్రహాలను క్యాంప్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసి, ఘనంగా ఉత్సవాలు జరుపుతున్నారు. అదే సమయంలో, బీసీ నాయకుల విగ్రహాలకు సరైన రక్షణ లేకుండా, పారవేసి వదిలిపెట్టడం బాధాకరమైనదిగా పేర్కొన్నారు.అంతేకాక, సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని సంవత్సర కాలంగా ప్రారంభించకపోవడం, రాజకీయ వర్గాల మధ్య వివాదాలకు దారితీసింది. ఈ పరిస్థితిని బీసీ సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, చాకలి ఐలమ్మ స్ఫూర్తితో, అఖిలపక్ష ఐక్యవేదిక పోరాటాన్ని కొనసాగించదలిచింది అని సతీష్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, సతీష్ యాదవ్, కొత్త గొల్ల శంకర్, వెంకటేశ్వర్లు, గౌనికాడి యాదయ్య, గంధం సుమన్, బొడ్డుపల్లి సతీష్, గంధం భరత్ మరియు ఇతర సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అవినీతికి పాల్పడితే సభ్యత్వాన్ని తొలిగిస్తాం..


- **టౌన్ ప్లానర్స్ అసోసియేషన్**

**వారధి న్యూస్, వనపర్తి :** గత ప్రజావాణిలో అఖిల పక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు టౌన్ ప్లానర్‌లు అవినీతి పాల్పడుతున్నారని పిర్యదు చేయడం జరిగింది. ఈ పిర్యాదు పై టౌన్ ప్లాన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు ఓ ప్రకటనలో తెలిపారు. కొందరు చేసిన పనులు అందరికి ఆపాదించడం సరికాదని వారు తెలిపారు. ప్రజల ఆదరణతోనే ప్రభుత్వ విధివిధానలతోనే పర్మిషన్, లే అవుట్ లకు ఇతర అనుమతులకు టౌన్ ప్లానర్స్ వారధుల మాత్రమేనని తప్పుడు పత్రాలను సృష్టించే వాళ్ళం కాదని వారు పేర్కొన్నారు. అవినీతి కి పాల్పడే వారిపై చర్యలకు వెనుకాడమని వారు తెలియజేశారు.

# ఎండు గంజాయిని తరలిస్తున్న ఐదుగురు నిందితులు అరెస్టు

- **254 కేజీల గంజాయి స్వాధీనం**







**వారధి న్యూస్, గండిపేట్:** అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్న ఐదుగురు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 254 కేజీల ఎండు గంజాయి, రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 1,04,65,700 గా నిర్ధారించారు.పోలీసులు చేసిన విలేకరుల సమావేశంలో, డీసీపీ శ్రీనివాస్ ఈ వివరాలను వెల్లడించారు. యూపీకి చెందిన ఠాకూర్ సచిన్‌సింగ్ (30), మహ్మద్ నదీమ్ (21), మహ్మద్ సక్లీన్ (24), మహ్మద్ సలీమ్ (24), ప్రశాంత్‌సింగ్ (22) అనే నిందితులు ఏపీలోని అరకు లోయ నుంచి తరచూ గంజాయిని సరఫరా చేస్తారు. ఈ నెల 6వ తేదీన, ఠాకూర్ సింగ్ తన వాహనాన్ని అరకు నుంచి హైదరాబాద్‌కు తరలించడానికి ముంబై నదీమ్, సక్లైన్, సలీమ్‌లను పిలిచాడు.ఈ ప్రకారం, ముంబై పెడ్లర్స్ విజయవాడ చేరుకున్నారు మరియు 7వ తేదీకి ఠాకూర్ సింగ్‌తో చేరుకున్నారు. 8వ తేదీకి అరకు లోయలో ప్రధాన సరఫరాదారు రాజును కలిశారు మరియు 254 కేజీల ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని యూపీకి, ముంబైకి తరలించాల్సి ఉంది. 10వ తేదీన, రాజేంద్ర నగర్ పోలీసులు విశ్వసనీయ సమాచారం ఆధారంగా, ఓఆర్ఆర్ సమీపంలో ఉన్న సర్వీస్ రోడ్డులో 100 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులు, వినోద్ కుమార్ యాదవ్, రవీందర్ యాదవ్ పోలీసులకు కనిపించినప్పుడు పరారయ్యారు, అయితే ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 254 కేజీల ఎండు గంజాయి, 32 కంట్రీ మేడ్ పిస్టల్స్, రెండు వాహనాలు, మొబైల్ ఫోన్లు, నకిలీ నగదు తదితర పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ. 1,04,65,700 గా నిర్ధారించబడింది.ఈ దాడి లో, ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాస్, అడిషనల్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, ఏసీపీ రాజేంద్ర నగర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, మరియు ఇతర పోలీసు బృందాలు పాల్గొన్నారు.



## డిజిటల్ యాప్స్ తో వ్యవసాయంలో విప్లవం

- **జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్**

**వారధి న్యూస్, మెదక్:** డిజిటల్ యాప్స్ వ్యవసాయ రంగంలో విప్లవాన్ని సృష్టించగలవని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ చెప్పారు. మంగళవారం, ఆయన వ్యవసాయ శాఖ కార్యాలయంలో డిజిటల్ యాప్స్, డిజిటల్ లైబ్రరీ, మరియు డిజిటల్ వ్యవసాయ కోర్సులతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు.గోవింద్ మాట్లాడుతూ, “ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని” తెలిపారు. డిజిటల్ టూల్స్ ద్వారా రైతులు తక్కువ శ్రమలో ఎక్కువ దిగుబడిని పొందగలరని, ఇది వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని చెప్పారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ (క్యాబి) ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ యాప్‌లు, డిజిటల్ లైబ్రరీ, మరియు డిజిటల్ వ్యవసాయ కోర్సులు వ్యవసాయ రంగంలో యువ రైతులు, విద్యావంతులైన రైతులు ఉపయోగించుకోవాలని గోవింద్ సూచించారు. ఇవి రైతులకు నూతన పరిజ్ఞానాన్ని అందించడానికి, చీడపీడలను అరికట్టడానికి, మరియు సేంద్రీయ పద్ధతులను నేర్చుకోవడానికి సహాయపడతాయని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో, మండల వ్యవసాయ శాఖ అధికారులు రాజ్ నారాయణ, సోమ లింగారెడ్డి, హర్ష, కోఆర్డినేటర్ అమరేష్ కుమార్, మరియు సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ దక్షిణాసియా కోఆర్డినేటర్ మధు మంజరి పాల్గొన్నారు. అన్ని వ్యవసాయ కార్యక్రమాలను మెరుగుపర్చడం కోసం ప్రతి రైతు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ద్వారా డిజిటల్ యాప్స్‌ను డౌన్లోడ్ చేసుకొని ఉపయోగించవచ్చు అని గోవింద్ సూచించారు.




## వీరనారి ఐలమ్మ మహిళలకు స్ఫూర్తి

- **మహిళా సమాఖ్య నేతలు**

**వారధి న్యూస్,వనపర్తి :** వీరనారి ఐలమ్మ మహిళకు స్ఫూర్తి కావాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐ డబ్ల్యు) నేతలు ఆకాంక్షించారు. వనపర్తి ఆఫీసులో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలను భారత జాతీయ మహిళా సమాఖ్య వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగాభారతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు పి కళావతమ్మ, వనపర్తి పట్టణ కమిటీ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు శిరీష, భూమిక, సునీత, జయశ్రీ మాట్లాడారు. చదువు రాకపోయినా, కష్టాలు ఎదురైనా పరిస్థితులకు ఎదురొడ్డి ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ విముక్తికై పోరాడారన్నారు. మహిళలు, బాలికలపై సామూహిక అత్యాచారాలు, హత్యలు, హత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయని చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కల్పన ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# కలం యోధుడు.. గడ్డం కేశవమూర్తి



సాహితీ దివ్వెగా పేరుగడించిన ఆయన కలం యోధుడు. 'జీకే'గా అభిమానులు పిలుచుకునే గడ్డం కేశవమూర్తి జగమెరిగిన రచయిత. రేపటితరం కోసం ఆరాటపడే ఆయన రచనల్లో సామాజిక చైతన్యం ఉంటుంది. వ్యాసాలు, విశ్లేషణలు, కథలు, జీవిత చరిత్రలు.. ఇలా విభిన్న రంగాల్లో రాణిస్తున్న ఆయన సాహితి దిగ్గజం. అందరిని ఆత్మీయంగా పలకరించే సంస్కారం.. విరోధులను సైతం తనవారిగా మార్చగల అనుబంధం కేశవమూర్తిది. సుగుణాలు.. సంస్కారం నుంచి మొదలవుతాయని.. సంస్కారం, సంబంధాల నుంచి పుట్టుకొస్తాయని నమ్మె యువ రచయిత స్పెషల్స్టోరి ఇది !



**మధుకర్ వైద్యుల**
సీనియర్ జర్నలిస్ట్



వర్ధమాన రచయితలకు.. జర్నలిస్టులకు స్ఫూర్తి... గడ్డం కేశవమూర్తి. కలం పడితే పేదల కష్టాలను పేపరు మీద ఆవిష్కరిస్తాడు.. వారి సమస్యలను తనవే అన్నట్లు చెప్పుకుంటాడు... సందర్భం ఏదైనా... సంకోచించకుండా అందరిని పలుకరిస్తారు. సాహిత్యంపై ఉన్న మక్కువతో ఇప్పటి వరకు ఆరు పుస్తకాలను రచించారు. రెండున్నర దశాబ్దాల క్రితం జర్నలిజం వృత్తిలో చేరిన కేశవమూర్తి సహజ హితం కోసం క్షణం తీరికలేకుండా రచనలు కొనసాగిస్తూనే అందరి మన్ననలు పొందారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత సివిల్ సర్వెంట్ల పాత్ర ఘననీయమైనదంటూ.. 'జనసారథులు' పేరిట ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని రచించి కవి కిరణమూర్తిగా పేరుగడించారు. గతంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అప్పటి పది జిల్లాల్లోని ప్రజల్లో నెలకొని ఉన్న ఆకాంక్షను అక్షర రూపంలో తెలియజేస్తూ 'తెలంగాణ ఆత్మఘోష' అనే పుస్తకాన్ని రాశారు. అలాగే కేశవమూర్తి తాను కుటుంబంలో ఎదుర్కొన్న ఆటుపోట్లు, పడిన కష్టాలను వివరిస్తూ... తన బాధ అందరి బాధేనని 'అంతర్మథనం' పేరిట మరో రచనను పుస్తక రూపంలో వెలువరించాడు. అదేవిధంగా సీనియర్ ఐఏఎస్ అధికారి సి. పార్థసారధి జీవిత చరిత్రను 'ప్రజావారధి... పార్థసారథి"... పేరిట మరో పుస్తక రూంలో ఆవిష్కరించాడు. ఇప్పటి వరకు ఆరు పుస్తకాలు రాసిన కేశవమూర్తి పలువురితో ప్రశంసలు అందుకున్నాడు. స్వచ్ఛమైన మానవ సంబంధాలు కొనసాగిస్తూ... అందరి అభిమానాలు, పలు అవార్డులు సొంతం చేసుకున్నాడు. ఈయన ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయిలో "ఇందిరాగాంధీ ప్రియదర్శిని 'జాతీయసమైఖ్యత' 'మథర్ థెరిస్సా' అవార్డులను అందుకున్నాడు, ఇప్పటి వరకు కేశవమూర్తి రాసిన పుస్తకాలు అన్ని కూడా సీనియర్ ఐఎఎస్ అధికారి పార్థసారథి ఆశీస్సులతోనే ప్రచురించడం జరిగిందని కేశవమూర్తి పేర్కొన్నారు. ఆయన రచించిన పుస్తకాలన్నీ కూడా ఉచితంగా పంపిణి చేయడం గమనార్హం.

**కేశవమూర్తి ప్రస్థానం... పొందిన సత్కారాలు...**

బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరెన్నికగన్న గడ్డం కేశవమూర్తి శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో 1966 అక్టోబర్ 10వ తేదీన జన్మించారు. ఎం.ఎ. తో పాటు జర్నలిజంలో పి.జి.డిప్లమా పూర్తి చేసిన కేశవమూర్తి ప్రస్తుతం హన్మకొండలోని కుమార్పల్లిలో స్థిరపడి రెండున్నర దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష పదవితో పాటు ఓ జాతీయ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న ఆయన జర్నలిస్టుల సంక్షేమంతోపాటు సమాజవికాసానికి తనవంతు సేవలను అందిస్తున్నారు. 1989లో జర్నలిజం వృత్తిలో ప్రవేశించిన గడ్డం కేశవమూర్తి ఇప్పటి వరకు ఈనాడు, ఆంధ్రభూమి, వార్త, పొద్దు, చర్చ, మెట్రో, ఆంధ్రప్రభ దినపత్రికలతో పాటు, 'సుప్రభాతం' వారపత్రికలో సుదీర్ఘకాలం పనిచేశారు. చంద్రయూత్ అసోసియేషన్ అధ్యక్షునిగా, బ్రయిట్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కేశవమూర్తి జర్నలిస్టుల సంఘంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేగాక సమాజహితం కోసం పాటుపడుతూ, పలు రచనలు కూడా చేశారు. అటు పాత్రికేయునిగా, ఇటు విశ్లేషకునిగా, రచయితగా పనిచేస్తూనే సంఘసంస్కర్తగా, ఎన్నో ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సమాజ హితాన్ని కాంక్షిస్తూ రచించిన ఈ 'అంతర్మథనం' పుస్తకం విశేష ఆధరణ పొందిన విషయం విధితమే. అయితే సాహితీవేత్తగా, రచయితగా, సమాజవికాసానికి కేశవమూర్తి చేసిన ప్రశంసనీయ సేవలకు గుర్తింపుగా, వరంగల్ జిల్లాలో కలెక్టర్లుగా పనిచేసిన కె.ప్రభాకర్ రెడ్డి, యన్.శ్రీధర్, రాహుల్ బొజ్జా, జి.కిషన్, వాకాటి కరుణ తదితరులు పలు ప్రశంసాపత్రాలు ఆయనకు అందజేశారు. అలాగే హైదరాబాద్కు చెందిన చెలిమి సాంస్కృతిక సమితి, శ్రీ త్యాగరాయగాన సభ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహిత, పద్మభూషణ్ డా.సి. నారాయణరెడ్డి సంక్రాంతి 2012 పురస్కారాన్ని, అలాగే విశాఖపట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో “ఒడిశా” మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో “లైఫ్రెం॥ అఛీవ్మెంట్ అవార్డును కేశవమూర్తికి ఇచ్చి సత్కరించారు. అదేవిధంగా విభిన్న రంగాలలో విశిష్ఠ సేవలకు గుర్తింపుగా, హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూడా “ప్రసంసాపత్రాన్ని" అందజేసింది. అలాగే వివిధ సందర్భాల్లో సాహితి పురస్కారాలను, “స్టేట్ బెస్ట్ సిటిజన్” అవార్డుతో పాటు “ఉగాది పురస్కారం, ఉత్తమ రచయిత, ఆంధ్రరత్నం, ప్రతిభామూర్తి, విశిష్ఠ ప్రతిభామూర్తి” తదితర అవార్డులను కూడా గడ్డం కేశవమూర్తి గతంలో అందుకున్నారు. అలాగే జ్ఞానపీఠ అవార్డు గ్రహిత డా॥ సి. నారాయణ రెడ్డి గారి నుండి “కవి కిరణమూర్తి" బిరుదును స్వీకరించడమేగాక, విజయవాడలో మానస సాహిత్య అకాడమి నుండి 'సాహిత్య రత్న' పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే వరంగల్ ప్రెస్ క్లబ్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ వైస్టాన్స్లర్ బి.వెంకటరత్నం అప్పటి జిల్లా కలెక్టర్ రాహుల్ బొజ్జా ఆయనను సన్మానించారు. అలాగే ఢిల్లీలో భారత ఎన్నికల సంఘం మాజీ చీఫ్ కమీషనర్ డాక్టర్ జి.వి.జి. కృష్ణమూర్తి నుంచి భారత మాజీప్రధాని “ఇందిరాగాంధి ప్రియదర్శిని" అవార్డును, భారతీయ దళిత సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షులు డా॥యస్.పి. సుమనాక్షర్ నుండి మహాత్మ జ్యోతిరావు పూలే నేషనల్ ఫెల్లోషిప్ అవార్డును కేశవమూర్తి స్వీకరించారు. హైదరాబాద్లో జాతీయ సమైఖ్యతా అవార్డును, వైజాగ్లో నేషనల్ బెస్ట్ సిటిజన్ అవార్డును కేశవమూర్తి పొందినారు. అటు జర్నలిస్టులకు ఆదర్శంగా నిలుస్తూ... ఇటు సాహిత్యంలో రానిస్తున్న మన కేశవమూర్తి వర్ధమాన రచయితలకు ఆదర్శం.





## డబల్ బెడ్ రూమ్ అవకతవకలను ప్రశ్నించినందుకు అక్రమ కేసులు

- రాజేంద్ర ప్రసాద్

**వారధి న్యూస్ పెబ్బేరు:** మున్సిపాలిటీ పరిధిలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో అవకతవకలను ప్రశ్నించినందుకు కేసులు పెట్టడం అన్యాయం అని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సంధర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి రోడ్డు విస్తరణ లో పాక్షికంగా ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయపరంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మరియు పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి పాట్లు కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ బాధితులకు న్యాయం జరగాలని నీరసన వ్యక్తం చేస్తే మా పైన అక్రమ కేసులు పెట్టడం జరిగింది, ప్రజల కోసం కోర్టుల కు వెళ్ళడానికి గర్వంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్, రంజిత్, వెంకట్రాములు, బొర్రమోని రాములు, షకీల్, షబ్బీర్, సునీల్ తదితరులు పాల్గోన్నారు.



## *వీర వనిత చాకలి ఐలమ్మ* కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్

**వారధి న్యూస్ పెబ్బేరు:** మహిళలకు చాకలి ఐలమ్మ వీర వనిత అని అమే జీవితం స్ఫూర్తిదాయకం పోరాట పటిమను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలనీ కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.మంగళవారం వ్యవసాయ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సంధర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య ప్రజలు,రైతుల పైదౌర్జన్యలను,మహిళల పై ఆరాచకాలను,నిరంకుశ నిజాం రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ అన్నారు.చాకలి ఐలమ్మ పోరాట పటిమను నేటి మహిళలు తీసుకోవాలన్నారు. భుమ్మికోసం,భుక్తికోసం,వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను,పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన మన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, నరేందర్, రణధీర్, మన్యం, వెంకటరత్నం నాయుడు, ఖాయుం, రాజక సంఘ నాయకులు నరసింహ, సురేష్, రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గోన్నారు.




## ఖైరతాబాద్ బడా గణేష్‌ని దర్శించుకున్న డిప్యూటీ మేయర్

- ఆ గణనాథుని ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజల మీద ఉండాలని కోరుకున్నాము

**వారధి న్యూస్ హైదరాబాద్:** ఖైరతాబాద్ లో ప్రతిష్టించిన శ్రీ సప్తముఖ మహా శక్తి గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి శ్రీ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతులు , ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ దంపతులను శాలువతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు, ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ గత 70 వసంతాల నుండి ఖైరతాబాద్ గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఘనంగా జరుపుకుంటున్నామని ఈ ఏడాది కూడా 70 అడుగుల గణపతిని ప్రతిష్టించుకొని ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నాం ,ఈ గణనాధుని ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని వాళ్లు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నాము అని తెలిపారు.

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పిసిసి అధ్యక్షుని కలిసి శుభాకాంక్షలు తెలిపిన సందీప్ రాజ్

**వారధి న్యూస్ హైదరాబాద్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిసిసి అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర టిపిసిసి సెక్రెటరీ దాడిగా సందీప్ రాజ్. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్ మాజీ అధ్యక్షులు గంట రాజు సాగర్ సికింద్రాబాద్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సురేష్ ,అనంత కృష్ణారావు, భూపతి హరి, లీగల్ నవీన్, సాయి చందర్, తదితరులు ఉన్నారు.



# సోలార్ విద్యుత్ పైలట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లె

- టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ





వారధి న్యూస్,నాగర్ కర్నూలు జిల్లా బ్యూరో: కొండా రెడ్డి పల్లి గ్రామాన్ని పూర్తిగా సోలార్ విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.కొండారెడ్డిపల్లి లోని 33 /11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లో మొక్కలు నాటిన విద్యుత్ శాఖ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్.మంగళవారం నాగర్ కర్నూలు జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లెలో సోలార్ విద్యుత్ పైలట్ ప్రాజెక్టు ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు నెలకొల్పాలి గృహ, వాణిజ్య విద్యుత్ అవసరాలతో పాటు రైతులకు ఉచితంగా సోలార్ పంప్ సెట్ లు అందించాలనే ప్రణాళిక రూపొందించనున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, తెలిపారు. సోలార్ విద్యుత్ పైలట్ ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా, జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్, అధికారులతో కలిసి సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, కొండారెడ్డిపల్లెలో పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన కార్యచరణ ప్రణాళికను గ్రామంలో అధికారులు గ్రామ ప్రజలతో చర్చించారు. అనంతరం ఆయన కొండారెడ్డిపల్లి గ్రామంలోని ప్రజలు రైతుల అభిప్రాయాలను ఆయన సేకరించారు. గ్రామస్తులు సౌర విద్యుత్ కు సంబంధించిన సందేహాలను విద్యుత్ శాఖ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్. దృష్టికి తీసుకురాగా అధికారులు వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా కొండా రెడ్డి పల్లి 33/11 కె.వి. సబ్ స్టేషన్ లో నిర్వహించిన విద్యుత్ శాఖ సమీక్ష సమావేశం లో రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండి ముషారఫ్ అలీ ఫారూఖి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సోలార్ విద్యుత్ ను వినియోగించుకునే ప్రయత్నంలో భాగంగా, గ్రామాలుగా సోలార్ విద్యుత్ కు మార్చే ప్రయత్నం లో పైలెట్ ప్రాజెక్టు కింద రెండు గ్రామాలను ఎంపిక చేసినట్లు, మొదటిది ముఖ్యమంత్రి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామం, రెండవ గ్రామాన్ని ఖమ్మం జిల్లాలో గుర్తించామని తెలిపారు. దీని కొరకు గ్రామంలో వారం రోజుల పాటు సోలార్ విద్యుత్కు సంబంధించిన బృందాలు పర్యటిస్తాయని , రైతులను, గ్రామస్తులను, వ్యాపారస్తులను కలిసి వారి యొక్క అభిప్రాయాలను సేకరించనున్నట్లు, వారికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేయడం కోసం అధ్యయన బృందాలు గ్రామాల్లో పర్యటించి అవగాహన కలిగిస్తాయని తెలిపారు.

**సోలార్ విద్యుదీకరణగా మారునున్న కొండారెడ్డి పల్లి గ్రామం,**

నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూనాగర్ కర్నూలు జిల్లా కొండారెడ్డి పల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు చేయనున్న సోలార్ విద్యుత్ ద్వారా గ్రామంలోని ప్రతి ఇల్లు, వ్యవసాయ పొలాలు, వాణిజ్య అవసరాల కోసం వినియోగించే విద్యుత్ సరఫరాను సోలార్ ద్వారా వినియోగించేల ప్రథమంగా కొండారెడ్డి పల్లెలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దీని ద్వారా భవిష్యత్తులో రైతులకు విద్యుత్ సమస్యలు ఎదురుకాకుండా చూడవచ్చని, నాణ్యమైన విద్యుత్తును పొందవచ్చని ఆయన అన్నారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేయడంలో భాగంగా గ్రామంలో ప్రతి ఒక్కరికి ఈ అంశంపై పూర్తిస్థాయి లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.అనంతరం విద్యుత్ శాఖ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కొండారెడ్డిపల్లి గ్రామంలో పర్యటించి వ్యాపారస్తులు లక్ష్మమ్మ తో మాట్లాడిన సిఎండి సోలార్ విద్యుత్ వినియోగించడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయనీ తెలిపారు .రైతు లింగయ్య కు సోలార్ విద్యుత్ వల్ల కలిగే ఉపయోగాలు,మరియు ఇతర ఆదాయ మార్గాలను వివరించారు. గ్రామ మహిళ జ్యోతి మహిళా సంఘం సభ్యురాలు లచ్చమ్మ ను గృహ అవసరాలకు సరిపడా విద్యుత్ సూర్యుని ఎండ ద్వారా తయారు చేసుకోవచ్చని,మిగులు విద్యుత్ ను ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని ఆమెకు వివరించారు. అనంతరం ఊరి బయట వ్యవసాయ పొలంలోని ట్రాన్స్ఫార్మర్ దగ్గరకు వెళ్లి పరిశీలించి దగ్గర లోని యువ రైతు కుమార్ ను పలకరించి లో వోల్టేజ్ సమస్యలు ఏమైనా ఉన్నాయా, కరెంటు నిరంతరాయంగా అందుబాటులో ఉన్నదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్.కల్వకుర్తి తహసిల్దార్ ఆఫీస్ లో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామంలోని గృహ అవసరాలకు సంబంధించి 499 సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయని, వాణిజ్య అవసరాలకు సంబంధించి 66 సర్వీస్ కనెక్షన్లు, పరిశ్రమలకు సంబంధించి 10 సర్వీస్ కనెక్షన్లు, వ్యవసాయ కనెక్షన్లు 867 ఉన్నాయని, విద్యుత్ దీపాలకు సంబంధించి ఏడు కనెక్షన్లు ఉన్నాయని, విద్యకు సంబంధించి రెండు కనెక్షన్లు ఉన్నాయని వీటన్నిటికీ కావాల్సిన ఓల్టేజ్. దానికి తగ్గ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. దసరా నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రెడ్ కో మేనేజింగ్ డైరెక్టర్ అనిలా, సెర్ఫ్ డైరెక్టర్ కృష్ణ, డైరెక్టర్ రాములు, అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జివి రమేష్, వివిధ శాఖల అధికారులు వంగూరు మాజీ జెడ్పిటిసి కెవియన్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## హుస్సేన్ సాగర్ లో వినాయక నిమజ్జనాలకు హైకోర్టు కీలక తీర్పు

- మట్టి,ఏకో ఫ్రెండ్లీ విగ్రహాలు మాత్రమే నిమర్జనాలు

**వారధి న్యూస్ హైదరాబాద్ :** హుస్సేన్ సాగర్ లో వినాయక విగ్రహాల నిమజ్జనం పై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 2021లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం మట్టి ఏకో ఫ్రెండ్లీ విగ్రహాలను మాత్రమే స్పష్టం చేసింది. పి వో పి విగ్రహాలను జిహెచ్ఎంసి ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనులో నిమజ్జనం చేయాలని తెలిపింది. పోలీస్ ఉన్నంత అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు దీనికి సంబంధించిన బ్యానర్ ట్యాంక్ బండ్ పై కట్టారు.






## కొండారెడ్డి పల్లెను రాష్ట్రం లోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

- కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనులో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న వివిధ ప్రభుత్వ శాఖల నిర్మాణ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వివిధ శాఖల అధికారులతో కలిసి కొండారెడ్డిపల్లిలో పర్యటించి వివిధ శాఖల అభివృద్ధి, నిర్మాణ పనులపై సమీక్షించారు. ప్రస్తుతం గ్రామంలో నిర్మాణం అవుతున్న ప్రభుత్వ పాఠశాల, గ్రంథాలయం, పాలశీతలీకరణ కేంద్రం, గ్రామపంచాయతీ, బీసీ కమ్యూనిటీ హాల్, పశువైద్యశాల నిర్మాణా పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామాన్ని తెలంగాణ రాష్ట్రం లోనే ప్రత్యేక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. రోడ్ల విస్తరణ, అండర్ డ్రెయినేజీ నిర్మాణం, శ్రీశైలం హైవే రోడ్డు నుంచి గ్రామం వరకు నాలుగు వరుసల రహదారి విస్తీర్ణ పనులను, విద్యుద్ధీకరణ లాంటి అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులతో అడిగి తెలుసుకున్నారు. పనులు అన్నింటిని నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా వంగూరు మండల కేంద్రంలో సమీకృత భవన నిర్మాణం, వంగూరు నుంచి జూపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు, సర్వారెడ్డిపల్లి నుంచి వంగూరు మీదుగా కొండారెడ్డిపల్లి డబల్ రోడ్డు విస్తీర్ణ పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ అభివృద్ధి పనులను దసరా పండుగలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి దసరా రోజు వస్తుండటంతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని అందుకు అనుగుణంగా గ్రామంలో కొనసాగుతున్న అన్ని రకాల అభివృద్ధి నిర్మాణ పనులను పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జివి రమేష్, వివిధ శాఖల అధికారులు వంగూరు మాజీ జెడ్పిటిసి కెవియన్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ చూపుతూ ఆనాటి దేశ్ ముఖులు, రజాకార్ల గుండెల్లో భయం పుట్టించిందని, మహిళలకు స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్ అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రజక సంఘం నాయకులు, అధికారులతో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల్పించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షులు శాలేశ్వర్, మల్లేష్, బాలస్వామి, బంగారయ్య, కార్యాలయ పర్యవేక్షకులు కార్యాలయ సిబ్బంది సురేష్, శివప్రసాద్, లక్ష్మయ్య, దశరథ్ తదితరులు పాల్గొన్నారు



## మహిళా యూనివర్సిటీలో సీటు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కోటి మహిళా యూనివర్సిటీ లో క్యాంపస్ లో పీజీ సీటు సంపాదించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కళాశాల విద్యార్థిని నందిని కు కెమిస్ట్రీ విభాగంలో సీటు సాధించగా బండి అనిత బాటనీ విభాగంలో పీజీ సీటు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా తెలిపారు. సీటు సాధించిన సందర్భంగా ఆయా డిపార్ట్మెంట్ల హెచ్ఓడీ ల ను ఇతర సబ్జెక్టు లకు సంబంధించిన అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నందిని, బండి అనితలకు పుష్పగుచ్ఛం అందజేసి విద్యార్థుల సమక్షంలో అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయులు, కోదండ రాములు, ఉమాదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## అజంతా స్వీట్ హౌస్‌లో కొలువుదీరిన గణనాథుడు

- **సేవా దృక్పథంతో స్వచ్ఛమైన నేతి మిఠాయిలు తక్కువ ధరకే అందిస్తున్నము**

**వారధి న్యూస్ హైదరాబాద్ :** సికింద్రాబాద్ లో మిఠాయి దుకాణంలో కొలువు దీరిన చిన్ని గణనాధుడు వినియోగ దారులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. మోండా మార్కెట్ వెనుక వైపున ఉన్న ఈ మిఠాయి దుకాణం అజంతా స్వీట్ హౌస్ 1941లో ప్రారంభమై నగర ప్రజల నోళ్లను తీపి చేయడమే కాకుండా పండుగలు, శుభకార్యాలకు మిఠాయిలు అవసరమైనప్పుడు అజంతా స్వీట్ హౌస్ గుర్తుకు వస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. స్వీట్ హౌస్ యజమాని నందకిషోర్ జోషి మాట్లాడుతూ 90ఏళ్లుగా అంటే ఇప్పటికి మూడు తరాల నుండి ఈ మిఠాయి షాప్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటి నుండి కూడా నాణ్యత విషయంలో రాజీ పడకుండా మిఠాయిలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీ రామ నవమి, దీపావళి, దసరా, హనుమాన్ జయంతి వచ్చిందంటే తమ స్వీట్ షాప్ వినియోగ దారులతో కిటకిట లాడుతుందని వెల్లడించారు. స్వీట్ డబ్బాలకు పెద్ద ఎత్తున ఆర్డర్ లు కూడా వస్తాయని చెప్పారు. లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో స్వచ్ఛమైన నేతి మిఠాయిలు తక్కువ ధరకే అందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.








## నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ వీరి వనిత చాకలి ఐలమ్మ

**వారధి న్యూస్ మహబూబ్ నగర్** బడుగు బలహీన వర్గాల వారిని నిజాం నిరంకుశ పాలకులుఏ విధంగా హింసించారో తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా ప్రపంచానికి తెలియజేసిన వీర వనిత చాకలి ఐలమ్మ అని మహబూబ్ నగర్ శాసనసభ్యులు ఎన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళ వారం ఆయన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకొని మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మలి దశ తెలంగాణ ఉద్యమానికి చాకలి ఐలమ్మ ,దొడ్డి కొమరయ్య లాంటి అమరవీరులు స్ఫూర్తిని ఇచ్చారని, వారి స్ఫూర్తితోనే సబ్బండ వర్ణాలు తెలంగాణ కోసం సమ్మె చేస్తే ఢిల్లీ దిగొచ్చి తెలంగాణ ఇచ్చిందని తెలిపార తెలంగాణ మహిళలు, ఆడ బిడ్డలకు చాకలి ఐలమ్మ స్ఫూర్తిని ఇచ్చారని, అలాంటి చాకలి ఐలమ్మ చరిత్రను పాఠ్యపుస్తకాలలో భద్రపరుచుకుని అందరికీ అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఆడపిల్లల చదువు, ఉద్యోగాలు, వారి భద్రతపై ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగానే ఆడపిల్లల విద్య, వైద్యం పై నూతన ప్రభుత్వం దృష్టి సారించిందని, చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో అందరం కలిసి ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్,వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఇందిర, జిల్లా రజక సంఘం గౌరవాధ్యక్షులు నర్సింహులు, పురుషోత్తం, మల్లేష్ ,దుర్గేష్, పాండు, సాయి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## వాహన్ సారధి : కొత్తగా సికింద్రాబాద్‌లో ప్రయోగం

**వారధి న్యూస్ హైదరాబాద్:** రవాణాశాఖ ఆన్లైన్ సేవలకు సంబంధించిన కొత్త పోర్టల్ అందుబాటులోకి రానున్నది. తెలంగాణ రవాణా శాఖ పేరుతో ఉన్న సేవలను ఇంకా పై వాహన్ సారధి పేరుతో శ్రీకారం చుట్టాలు ఉన్నారు. తొలుతగా సికింద్రాబాద్లో ప్రయోగాత్మకంగా అమలుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు 'సారధి 'లో వాహనాల వివరాలు వాహన్ లో నమోదు చేయనున్నారు. దీంతో అన్ని రకాల ఆన్లైన్ సేవలకు మార్గం సుగం కానున్నది.



## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులు

- **సిపిఐఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్ దేశ నాయక్**

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం సింగారం శాఖ ఆధ్వర్యంలో సిపిఐ ఎం పార్టీ శాఖమహాసభల సందర్భంగా సింగారం గ్రామంలోశాఖ కార్యదర్శి కామ్రేడ్ కొండముని బక్కయ్య జెండా ఆవిష్కరణ కార్యక్రమాని ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ ఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్ దేశ నాయక్ హాజరై మాట్లాడారు కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరణ చేస్తూ ముస్లిం రాజుకు హిందువులకు జరిగిన పోరాటం అంటూ విమోచన దినం అని అంటున్నారు ఇది ముమ్మాటికి పచ్చి అబద్ధం అన వారు అన్నారు నిజంగా మీరు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులైతే మీ ఉనికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా ప్రతి గ్రామంలో ఏ ఆనవాళ్లు కూడా లేవు సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టులు వాళ్ల సమాధులు వాళ్ళ స్తూపాలు ఏ గ్రామానికి వెళ్లిన బహిరంగంగా కనిపిస్తాయి కానీ ఈరోజు చరిత్రను వక్రీకరణ చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడానికి అబద్ధాలు ఆడటం తగదు అని హితవు పలికారు గత పార్లమెంటు ఎన్నికలలో తెలంగాణలో లబ్ధి పొందడానికి రజాకారు సినిమాను విడుదల చేసినారు కాశ్మీర్ ఫైల్స్ కేరళ స్టోరీ అంటూ నానా రకాలుగా పాటుపడిన పార్లమెంటు ఎన్నికలలో ప్రజలు బిజెపికి తగిన గుణపాఠం చెప్పి 240 సీట్లకే పరిమితం చేసినారు కూటమిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు ఇప్పటికైనా మీరు కనులు తెరిచి వాస్తవాలు మాట్లాడితే చరిత్ర మిమ్ములను క్షమిస్తుందని అన్నారు ఈరోజు సాకలి అయిలమ్మ 39వ వర్ధంతిని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించుకుంటున్నాము పార్టీ శ్రేణులు అందరు కూడా ఈ కార్యక్రమాన్ని విజయం విజయవంతం చేస్తున్నారు కాబట్టి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరణ చేయడం సిగ్గుచేటు అని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ మల్లేష్ సింగారం గ్రామ శాఖ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బాల్ లింగయ్య చిన్న అంజనేయ శాఖ కార్యదర్శి బక్కయ్య సాటు బుచ్చయ్య నీలం వెంకటయ్య పెద్ద అంజనేయ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## శిధిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర హాస్టల్

- **భవనాన్ని నేలమట్టం చేయాలి**
- **పాత భవనాన్ని కూల్చివేసి విద్యార్థులకు ఆటస్థలంగా మార్చాలి**
- **సిపిఎం మండల కార్యదర్శి మూడవత్ శంకర్ నాయక్**

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో :**నాగర్ కర్నూలు జిల్లాలోని బల్మూరు మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర పాత భవనము పూర్తిగా శిధిలావస్థకు చేరిందని దాన్ని నేలమట్టం చేసి విద్యార్థులు ఆడుకునే ఆట స్థలంగా మార్చాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎం శంకర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బల్మూరు మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సందర్శించి అక్కడున్న సమస్యలను అధ్యయనం చేయడం జరిగింది. పాత భవనము శిధిలావస్థకు చేరుతుందని 2009లో కొత్త భవనము నిర్మాణం చేసి అందులో విద్యార్థులను షిఫ్ట్ చేయడం జరిగింది. ఆ భవనం ముందు ఉన్న పాత భవనము శిధిలావస్థకు చేరి గోడలు కూలి ఎప్పుడు కూలుతుందోనని భయభ్రాంతులకు హాస్టల్ విద్యార్థులు గురవుతున్నారని అట్టి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే శిథిలావస్థకు చేరిన పాత బిల్డింగ్ను ధ్వంసం చేసి అక్కడ ఉండే స్థలాన్ని ఆటస్థలంగా మార్చాలని వారు డిమాండ్ చేశారు. పాత భవనం అక్కడ ఉండడంతో చెట్లు పొదలు, నీటి నిల్వ ఉండడం వలన పక్కనే ఉన్న హాస్టల్ వెల్డింగ్ లో ఉంటున్న విద్యార్థులకు దోమలు ద్వారా అంటువ్యాధుల బారిన పడి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని అట్టి ప్రమాదం నుంచి కాపాడడం కోసం ఉన్న పాత బిల్డింగ్ను ధ్వంసం చేసి విద్యార్థులకు రోగాల బారి నుండి కాపాడాలని జిల్లా కలెక్టర్ ని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు ఎండి లాల్ మహ్మద్, గ్రామ కార్యదర్శి ఆంజనేయులు నాయకులు భారీమం కృష్ణయ్య మాసయ్య బక్కయ్య చిన్నయ్య భరత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## వనపర్తి సమీకృత కార్యాలయం పేరుకు పట్టింపు లేకపోవడంతో ప్రజల్లో చర్చ..


**వారధి న్యూస్, వనపర్తి :** వనపర్తి జిల్లా సమీకృత కార్యాలయం పేరుకు బోర్డుపై అక్షరాలు ఊడిపోవడంతో పట్టింపు లేకుండా ఉన్న అధికారుల ను చూసి ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. నిత్యం ఉన్నతాధికారులు కార్యాలయంలో తిరుగుతున్నా, ఎవరూ బోర్డుపై ఉన్న అక్షరాలను సరి చేయించే శ్రద్ధ చూపకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం గా నిలుస్తుంది. ఈ పరిస్థితిని చూసి కార్యాలయానికి వచ్చే ప్రజలు తర్జనభర్జన పడుతున్నారు. ఇటీవల జరిగిన తెలుగు భాష దినోత్సవం సందర్భంగా కార్యాలయానికి వచ్చిన సందర్శకులు ఈ అంశాన్ని గమనించి చర్చకు దారి తీశారు.

## నేడు పాఠశాల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

- **మండల విద్యాధికారి జయ రాములు.**



**వారధి న్యూస్ పెబ్బేరు:** మండల స్థాయి స్కూల్ గేమ్స్ (ఎస్ జి ఎఫ్) అండర్ 14, 17 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, కోకో, అథ్లెటిక్స్ క్రీడలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్ ) పెబ్బేర్ నందు నేటి నుంచి ప్రారంభమవుతాయని మండల విద్యాధికారి తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీలలో మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి లు క్రీడలను ప్రారంభిస్తారని అయన తెలిపారు.వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ కురుమయ్య (పి డి ) ని 8500165900 సంప్రదించాలని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులతో పి ఈ టీ టీచర్ మరియు ఒక ఎస్కార్ట్ టీచర్ నీ పంపించవలసిందిగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారన్ని ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



## వీరవనిత చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:**వీర నారీ చాకలి ఐలమ్మ 39 వ వర్ధంతి సందర్భంగా అమ్రాబాద్ మండలం మన్ననూరు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పెర్మాల యశ్వంత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆమె చేసిన పోరాటాల గురించి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పెర్మాల యశ్వంత్, మంచెల అరుణ్ పాండ్యన్, నల్లవెల్లి యశ్వంత్, బిసి సంఘం నాయకులు ఎల్లయ్య, కృష్ణయ్య,రమణ, చెవ్వ బాలస్వామి, చరణ్ విశ్వకర్మ, శంకరయ్య, హన్మంత్ రెడ్డి, సైదులు, చంద్రయ్య, రాజు, వెంకట రమణ, శంకర్, కుమార్, భరత్, కురుమూర్తి, మురళి, శ్రీను, చంటి, అన్వేష్, వెంకటేష్, శ్రీను, శివ, చంద్రమోళి పాల్గొన్నారు.




## నాగర్‌కర్నూల్ జిల్లాలో సోహం అకాడమీ "రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్" కార్యక్రమం ప్రారంభం

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు జిల్లా బ్యూరో:** గత కొన్ని సంవత్సరాలు గా విద్యా రంగంలో నూతన మార్పులు తీసుకొచ్చే లక్ష్యంతో, సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో "రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ (RiA)" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడుతుంది. గతంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని మూడు పాఠశాలల్లో విజయవంతంగా రోబోటిక్స్ శిక్షణను నిర్వహించిన సోహం అకాడమీ, ఈ విద్యా సంవత్సరంలో అదనంగా 10 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఈ క్రమంలో, మొదటి దశగా జిల్లా పరిషత్ బాలురు నాగర్‌కర్నూల్,కెజి బివి నాగనూల్, నాగర్‌కర్నూల్; టి డబ్ల్యూ ఆర్ ఎస్ బాలురు బీజినపల్లి పాఠశాలల్లో శిక్షణను మంగళవారం ప్రారంభించారు. 7, 8, 9, 10 తరగతుల నుండి 342 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి గవర్నమెంట్ ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్ పాలెం, నాగర్‌కర్నూల్ విద్యార్థులు శిక్షణకర్తలుగా సహకరించారు, ఇది శిక్షణను మరింత సమర్థవంతంగా మరియు సజావుగా నిర్వహించడంలో సహాయపడింది.కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులు రోబోటిక్స్ యొక్క ప్రాథమిక సూత్రాలను నేర్చుకున్నారు. ప్రతి పాఠశాలకు రోబోటిక్స్ కిట్స్ పంపిణీ చేయబడింది. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది, ఇవి వారి నైపుణ్యాలకు గుర్తింపుగా అందజేయబడ్డాయి .ఈ కార్యక్రమం విజయవంతంగా ప్రారంభం కావడానికి జిల్లా కలెక్టర్ బడవత్ సంతోష్ గారు, జిల్లా విద్యాధికారి గోవింద్ రాజు, జిల్లా విజ్ఞాన అధికారి రాజశేఖర్ మద్దతు ముఖ్యంగా నిలిచింది. అలాగే, ఏఎమ్ఓ షరీఫ్ ఉద్దీన్, జిల్లా పరిషత్ పాఠశాల నాగర్ కర్నూల్ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు.సోహం అకాడమీ ప్రతినిధులు మాట్లాడుతూ, "మా లక్ష్యం రోబోటిక్స్ విద్య ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం" అని తెలిపారు. ఈ కార్యక్రమం నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ ఎన్ సీసీ,ఎస్ సీసీ మద్దతుతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది.

గత 3 సంవత్సరాలలో తెలంగాణలోని 16 జిల్లాల్లో 266 పాఠశాలల్లో 45,089 మందికి రోబోటిక్స్ పై అవగాహన కల్పించామని నిర్వాహకులు తెలిపారు.



## కామ్రేడ్ ఐలమ్మ కు విప్లవ జోహార్లు

**వారధి న్యూస్, వీపనగండ్ల :** సిపిఎం రైతు సంఘం, రజక సంఘం ఆధ్వర్యంలో వీపనగండ్ల మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపి, రైతు సంఘం నాయకులు ఎతం కృష్ణయ్య, రవీందర్ రెడ్డి, బాలస్వామి, సిపిఎం నాయకులు మురళి, ఆశన్న, సిహెచ్ వెంకటయ్య, ఈశ్వర్, ఇతర నాయకులు అయిలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, రైతు సంఘం నాయకులు ఎత్తం కృష్ణయ్య, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపి మాట్లాడుతూ..1919లో వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగవ సంతానంగా కామ్రేడ్ ఐలమ్మ జన్మించింది. పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం, చాకలి కుల వృత్తే వారికి జీవనాధారం. 194044 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ.

మల్లంపల్లి భూస్వామి కొండలరావుకు పాలకుర్తిలో 40 ఎకరాల భూమి ఉండగా ఐలమ్మ కౌలుకు తీసుకుంది. అందులో నాలుగు ఎకరాలు సాగుచేశారు. పాలకుర్తి పట్వారీ వీరమనేని శేషగిరిరావుకు ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. జీడి సోమనర్సయ్య నాయకత్వంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఐలమ్మ ఆ సంఘంలో సభ్యురాలు. పాలకుర్తి పట్వారీ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పనిచేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక అయిలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రా రెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్రనాయకులతో పాటు అయిలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. అయినప్పటికీ కోర్టులో తీర్పు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వచ్చింది. ఐలమ్మ కుమారులు ముగ్గురు పాలకుర్తి పట్వారీ ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు అయిలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. అయిలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం పంపకం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నక్క ఆంజనేయులు, రాములు, రామకృష్ణ, నవీన్, రైతులు వెంకటస్వామి, బాల పేరు, జానకి రాముడు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా మేకల గోవర్ధన్



**వారధి న్యూస్, దోమ:** మండల బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా మేకల గోవర్ధన్ నియమితులయ్యారు. వికారాబాద్‌లో జరిగిన భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ సమావేశంలో ఈ నియామక పత్రాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప అందజేశారు. మేకల గోవర్ధన్ నియామకంతో సంబంధిత మండలంలో ఓబీసీ మోర్చా కార్యకలాపాలు మరింత సజావుగా నడిపించాలని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ భాను ప్రకాశ్, ఇంచార్జ్ సార కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్షులు మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మెదక్ మెడికల్ కళాశాలకు అనుమతి

- **కలెక్టర్ రాహుల్ రాజ్**



**వారధి న్యూస్, మెదక్:** జిల్లా ప్రజలు ఎంత కాలంగా ఎదురు చూస్తున్న మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అవసరమైన అన్ని అనుమతులు మంజూరు అయ్యాయని కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు సంతోషకరమైన వార్త అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ యొక్క మార్గదర్శకత్వం, పట్టుదలతో జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ మరియు సిబ్బంది చేసిన కృషి ఈ విజయానికి కారణమని కలెక్టర్ తెలిపారు.ఈ విజయంలో కృషి చేసిన జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మరియు వైద్యులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ వైద్య కళాశాల ఏర్పాటు ద్వారా జిల్లా ప్రజలకు అధునికమైన మరియు మెరుగైన వైద్యం అందుబాటులోకి రానున్నదని కలెక్టర్ రాహుల్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు.

## గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు గాయం శ్రీనివాస్ రెడ్డి మృతి



**వారధి న్యూస్, మునగాల:** మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గాయం శ్రీనివాస్ రెడ్డి (50) గుండెపోటుతో మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యుల ప్రకారం, శ్రీనివాస్ రెడ్డి స్థానిక ప్రైవేట్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా కూడా పనిచేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు పదవ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్ ఇవ్వడం తరువాత ఇంటికి వెళ్లి భోజనం చేసిన తరువాత పడుకున్నారు. అప్పుడు గ్యాస్ పట్టి హార్ట్ ఎటాక్ రావడంతో మృతి చెందినట్లు వివరించారు.శ్రీనివాస్ రెడ్డికి భార్య మరియు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన హఠాన్మరణానికి ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతి

**వారధి న్యూస్, మెదక్:** హైదరాబాద్ కు వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వెళ్ళుతుండగా, మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్ళిపోతున్న లారీ, రహదారిలో వేగంగా వెళ్ళిన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన దొంతి భూదయ్య (తండ్రి) మరియు దొంతి మల్లేష్ (కొడుకు) ప్రాణాలు పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో, దొంతి మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందగా, భూదయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో, తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఒకే ఇంట్లో తండ్రి, కొడుకు మృతితో కుటుంబసభ్యులు, గ్రామస్తులు తీవ్రంగా బాధపడుతున్నారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. మల్లేష్‌కు భార్య మరియు రెండున్నర సంవత్సరాల కుమార్తె ఉన్నారు. ప్రమాదంలో మృతుల దేహాలను పోస్టుమార్టం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



## మేడ్చల్ ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ పోస్టుల భర్తీపై ఎస్ఎఫ్ఐ డిమాండ్

**వారధి న్యూస్, మేడ్చల్:** మేడ్చల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. మూడు నెలల కిందట లెక్చరర్లు బదిలీ చేయబడిన తరువాత, ఖాళీగా ఉన్న పోస్టులను ఇప్పటివరకు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.ఉదయాన్నే, ఎస్ఎఫ్ఐ నాయకులు మరియు విద్యార్థులతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కు వినతి పత్రం అందజేసి, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.ఈ సందర్భంగా రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, "విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా, కళాశాలలో లెక్చరర్ పోస్టులు భర్తీ చేయలేదని, దీంతో విద్యార్థులు సబ్జెక్టులలో లోటు పడుతూ, అందువల్ల తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై శ్రద్ధ వహించకపోతే, రెండు లేదా మూడు రోజుల్లో చలో సెక్రటేరియట్ ఆందోళనను నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సుమన్, బాబు, శ్రీకాంత్, రమేష్, అరవింద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీత డాక్టర్ కిషోర్‌కు ఘన సన్మానం



**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు డా కిషోర్ పాలమూరు యూనివర్సిటీలో పరిపాలన భవనం యందు కాన్ఫరెన్స్ హాల్ లో ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందిన మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు డా కిషోర్, అసోసియేట్ ప్రొఫెసర్ ను రిజిస్ట్రార్ డా మధుసూదన్ రెడ్డి, ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, డా కిషోర్ కు ఉత్తమ టీచర్ అవార్డు రావడం మన అందరికి గర్వ కారణం అని, బోధన లో నూతన పద్ధతులు ఆవలంభించి, విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి చెందేటట్టు చెయ్యాలని అన్నారు. పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డా చంద్ర కిరణ్ మాట్లాడుతూ డా కిషోర్ ఎంతో కష్ట పడ్డాడాని, టీచింగ్ తో పాటు రీసెర్చ్ లో 52 పబ్లికేషన్స్ రావడం ద్వారా యూనివర్సిటీ కి నాక్ గుర్తింపు లో ఉపయోగపడుతుందని అన్నారు.సన్మాన గ్రహీత డా కిషోర్ మాట్లాడుతూ అవార్డు రావడం తో మరింత గురుతర బాధ్యత పెరిగిందని, 2009 నుంచి ఇప్పటివరకు యూనివర్సిటీ అధికారులు ఏ బాధ్యత అప్పచెప్పిన, ఎంతో చిత్తశుద్ధి తో పని చేశానని, పని చేసుకుంటే వెళుతుంటే ఫలితాలు వాటాంతటకు అవే వస్తాయని, యూనివర్సిటీ లో టీచింగ్ తో పాటు పరిశోదనల పై దృష్టి సారించాలని, ప్రభుత్వం తన సేవలను గుర్తించి అవార్డు ప్రకటించినందుకు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమం లో పరీక్షల నియంత్రణ అధికారి డా రాజ్ కుమార్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డా విజయలక్ష్మి, డా శాంతి ప్రియ, ప్రిన్సిపాల్స్ డా నూర్జహాన్, డా బషీర్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ డా కృష్ణయ్య, ప్రొఫెసర్ జైపాల్ రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ డా అంకం భాస్కర్,వివిధ విభాగాధిపతులు డా నాగం కుమార స్వామి, డా ప్రభాకర్ రెడ్డి, డా శ్రీధర్ రెడ్డి, డా నాగసుధ, డా పుష్పలత, ఒప్పంద అధ్యాపక సంఘం నాయకులు డా అర్జున్ కుమార్, డా రవికుమార్, డా భూమయ్య, సుదర్శన్ రెడ్డి, అధ్యాపకులు రామ్మోహన్, సురేష్, నాగరాజు, డా విజయ భాస్కర్,నాన్ టీచింగ్ ఉద్యోగులు అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్, సంఘం నాయకులు రామ్మోహన్, కిరణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు మూఢ నమ్మకాలని విడనాడాలి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** తెలంగాణ నాస్తిక సమాజం ఆధ్వర్యంలో నాస్తిక అధ్యయన తరగతులు ఈనెల 15 ఆదివారం రోజు హైదరాబాదులో హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరుగును అందుకు సంబంధించిన కరపత్రాలను నాస్తిక సమాజం తెలంగాణ ఇన్చార్జి దాన గళ్ళ రవికుమార్, మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు చింత కింద జనార్ధన్, జిల్లాను ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మహబూబ్నగర్లోని మహామాయ గౌతమ్ బుద్ధ విహార్, గౌతమ బుద్ధ నగర్ క్రిస్టియన్ పల్లి నందు పత్రాలు ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఇతర పట్టణ సభ్యులు పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ నాస్తికఅధ్యయన తరగతులను సద్వినియోగం చేసుకొని సమాజంలోని పౌరులంతా సైన్స్ టెంపుల్ పెంచుకోవాలని మూడ విశ్వాసాన్ని అందవిశ్వాసాల్ని దయ్యం భూతం లాంటి మంత్రాల లాంటి నమ్మకుండా ఉండేందుకు తగు విధమైన అధ్యయన తరగతులు నిర్వహించడం జరుగుతుంది అందరూ పాల్గొని శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు.



## పేద విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ వహించాలి


**-అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** సంక్షేమ హాస్టల్లో చదువుతున్న పేద విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్ లో నియోజకవర్గంలోని ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజ్ వర్గంలో చదువుతున్న పేద విద్యార్థుల విద్యార్థులు మన పిల్లలు అంటే పేద పిల్లలు మిరే వారికి తల్లిదండ్రులు క్రమశిక్షణ నేర్పండి చదువు అదే వస్తుందని అన్నారు.సమయం చూసి హాస్టల్ లలో ఒక్క రోజు రాత్రి బస చేసే కార్యక్రమం మొదలు పెడతాఅన్నారు.విద్య,వైద్యం లో అలసత్వం వహిస్తే క్షమించేది లేదని కఠిన చర్యలు ఉంటామని హెచ్చరించారు., ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామ్ లాల్ ఏ ఎస్ డబ్ల్యూ ఓ లు, హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.



## పలు ఆసుపత్రులను అకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** మంగళవారం, జిల్లా వైద్యాధికారి డి.వై. పద్మ మరియు జిల్లా మాస్ మీడియా అధికారి గంగసాని మంజాల తో కలిసి పట్టణంలోని వివిధ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో, వారు ముఖ్యంగా ఆర్యోశ్రీ సేవలు అందిస్తున్న ఆసుపత్రులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. రోగులు మరియు వారి బంధువులతో భోజన వసతులు, చికిత్స విధానాలు ఎలా ఉన్నాయన్న విషయాన్ని వారు విచారించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఎన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారన్నది కూడా తెలుసుకున్నారు. అంతేగాక, ధరల పట్టికలు అన్ని ఆసుపత్రులలో స్పష్టంగా ప్రదర్శించాల్సిన అవసరం ఉందని సూచించారు. అటువంటి పట్టికలు పెట్టనివరకు చర్యలు తీసుకోవడం తప్పనిసరి అని హెచ్చరించారు.



## అమ్రాబాద్ నల్లమల లో గణనీయంగా పెరిగిన పెద్ద పులుల సంఖ్య

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు జిల్లా బ్యూరో** నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లో పెద్ద పులుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు జిల్లా డీఎఫ్ ఓ రోహిత్ గోపిడి తెలిపారు. 4వ ఫేజ్ మానిటరింగ్ సర్వే రిపోర్ట్ ను ఆయన అధికారికంగా వెల్లడించారు.ఈ సందర్భంగా గత సర్వేతో పోలిస్తే వన్యప్రాణుల సంతతి గణనీయంగా పెరిగినట్లు తెలిపారు..గతంలో 22గా ఉన్న పెద్దపులుల సంఖ్య ప్రస్తుత సర్వే ప్రకారం 34కు చేరిందన్నారు.వీటిలో 11 మగ పులులు, 15 ఆడ పులులు, 8 పులి కూనలు గుర్తించినట్లు వెల్లడించారు..అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ సర్కిల్ (నల్గొండ, నాగర్ కర్నూల్) నందు 4 బ్లాక్ లుగా విభజించి సర్వే చేసినట్లు చెప్పారు..903 లోకేషన్స్ లో 1806 కెమెరా ట్రాప్ లను ఏర్పాటు చేసి 12 డిసెంబర్ 2023 నుంచి 2 మే 2024 వరకు సర్వే కొనసాగిందన్నారు.





## ఐఐహెచ్‌టి పోచంపల్లి లోనే ఏర్పాటు చేయాలి

- **మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్ రెడ్డి**

**వారధి న్యూస్, భువనగిరి:** ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ను పోచంపల్లి లోనే ఏర్పాటు చేయాలని ఆలేరు మరియు భువనగిరి మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మరియు పైళ్ల శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రహదారి బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వహించి, ఈ అంశంపై వివరణ ఇచ్చారు.బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ, మంజూరైన టెక్స్టైల్ కళాశాలను రంగారెడ్డి జిల్లాకు తరలించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలని, గత ప్రభుత్వం చేసిన పనులను ఓర్వలేక ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని పేర్కొన్నారు.పోచంపల్లి హైస్లూమ్ టెక్స్టైల్ లో 26 ఎకరాల భూమి ఉండగా, రంగారెడ్డి జిల్లాలో ముచ్చింతల వద్ద కేవలం 6 ఎకరాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వ బృందం పోచంపల్లిని ఐఐహెచ్‌టి కళాశాల ఏర్పాటు కోసం అనువైన స్థలంగా గుర్తించిందని, అప్పట్లో మంజూరైన కళాశాలను తరలించవద్దని సూచించారు.గతంలో భువనగిరి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు భువనగిరి ప్రజలు తమకు అవకాశం ఇచ్చారని, ఈ రుణాన్ని తీర్చే విధంగా కళాశాలను పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, జిల్లాకు మంజూరైన కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించడం న్యాయం కాదని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అమరేందర్, పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, ఇట్టబోయిన గోపాల్, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, కస్తూరి పాండు పాల్గొన్నారు.



## గురుకుల పాఠశాలలను తరలించొద్దని విద్యార్థుల ధర్నా

**వారధి న్యూస్, వికారాబాద్:** దౌల్తాబాద్ మండలం లోని నీటూరు గ్రామానికి మంజూరైన గురుకుల పాఠశాలను తరలించొద్దని విద్యార్థులు, యువజన సంఘాలు మంగళవారం కొడంగల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. విద్యార్థులు మరియు యువకులు కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ (కడ) కార్యాలయం ముందు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. కానీ, అధికారులు స్పందించకపోవడంతో వారు బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ పరిస్థితి చూసి, రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థులు, యువకులను రాస్తారోకో నుంచి పక్కకు తీసుకువెళ్లే ప్రయత్నం చేశారు.ఈ సందర్భంగా, యువకులు మరియు విద్యార్థులు నీటూరు గ్రామంలోనే గురుకుల పాఠశాల నిర్మాణాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వారు అధికారులు వెంటనే స్పందించి, నిర్మాణాన్ని అదే గ్రామంలో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.





# కేతి రెడ్డి కాలువ మరమ్మత్తులకు కృషి చేస్తా

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**వారధి న్యూస్, తుంగతుర్తి:** తుంగతుర్తి శాసనసభ్యుడు మందుల సామేల్, కేతి రెడ్డి కాలువ మరమ్మత్తు మరియు ఇతర సామాన్య అవసరాలపై తన కృషిని తెలియజేశారు. మంగళవారం, తుంగతుర్తి మండలంలోని గొట్టిపర్తి గ్రామం సమీపంలోని కేతి రెడ్డి కాలువలను పరిశీలించి, ఈ కాలువల మరమ్మత్తు వెంటనే చేపట్టనున్నట్టు ప్రకటించారు.ఈ సందర్భంగా, కాలువ మరమ్మత్తు చేయడమే కాకుండా, ఊరి చివర గ్రామస్తులు పొలాల్లోకి వెళ్లే రోడ్డు సౌకర్యం, అలాగే పాఠశాలలో విద్యార్థుల కోసం సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. అలాగే, పోచారం గ్రామ సమీపంలో నిర్మాణం జరుగుతున్న బ్రిడ్జి పనులను, వరుసగా రావులపల్లి గ్రామంలో ఇటీవల వర్షాల కారణంగా క్షతిగ్రస్తమైన రోడ్డు స్థితిని పరిశీలించారు. ఎమ్మెల్యే మందుల సామేల్ వెంపటి గ్రామంలో సాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, ఐబీడీఈ సత్యనారాయణ, అనిల్ కుమార్, ఏ ఈ శ్రీకాంత్, ఏవో బాలకృష్ణ, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్లతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



## బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న
# బాలుడికి ఆర్థిక సహాయం

- హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం

**వారధి న్యూస్, గండిపేట్:** హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం సభ్యులు, మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ ద్వారా మిథున్‌బాబు అనే మూడేళ్ల బాలుడికి ఆర్థిక సహాయం అందించబడింది. బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న మిథున్‌బాబుకు ఆదరాభిమానాన్ని ప్రదర్శిస్తూ, సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించడమైనది.గత కొన్ని రోజులుగా బాలుడి ఆరోగ్యం క్షిణించడంతో నిలోఫర్ ఆసుపత్రిలో చేరించిన తర్వాత, వైద్యులు బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు నిర్ధారించారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో, బాలుడిని టిఎక్స్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి వైద్యులు, బాలుడి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు చెప్పడంతో, కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ నేపథ్యములో, హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం కుల బంధుమిత్రుల సహకారంతో, 1,85,100 రూపాయలు (సంఘం ద్వారా) మరియు ఎంపికేఎస్ ద్వారా 16,855 రూపాయలు కలిపి మొత్తం 2,01,955 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు."ఆపదలో ఉన్న వారికి మేమున్నామనే భరోసా కల్పిస్తున్నాము" అని ఎస్. వెంకటేష్ అన్నారు. ఈ చర్య ద్వారా, బాలుడి చికిత్సకు అవసరమైన నిధులు సమకూర్చడంతో, అతని కుటుంబానికి తాత్కాలిక ఉపశమనం కలిగించినట్లు తెలిపారు




## వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

- తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్

**వారధి న్యూస్, గండిపేట్:** తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (టీఐఈఎఫ్) వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం ఫెడరేషన్ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్, సెక్రటరీ కానుమిల్లి అమ్మిరాజులు ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది.మంగళవారం, ఫెడరేషన్ సభ్యులు షూటింగ్ లోకేషన్స్‌కు వెళ్లి, అక్కడ పనిచేస్తున్న వారితో కలిసి విరాళాలను సేకరించారు. ఫైట్ మాస్టర్ రామ్‌లక్ష్మి, డైరెక్టర్ మారుతీ, డైరెక్టర్ బాబీ, డైరెక్టర్ గుణశేఖర్ వంటి ప్రముఖులతో కలసి, వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమానికి స్పందించిన వారి అద్భుత సానుకూలతను ప్రశంసిస్తూ, ఫెడరేషన్‌కు వారంతా తమ వంతు సహాయం అందిస్తామని ప్రకటించారు. "మా వంతు సహాయాన్ని అందిస్తామని, ప్రతి ఒక్కరు సహకారం అందించాలని పిలుపునిచ్చారు" అని ఫెడరేషన్ సెక్రటరీ కానుమిల్లి అమ్మిరాజులు పేర్కొన్నారు.



## ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా చంద్రశేఖర్

**వారధి న్యూస్, చండూరు:** మంగళవారం నల్గొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుని ఎన్నికలలో, చండూర్ రెవిన్యూ డివిజన్, చండూర్ మండలానికి చెందిన నకుచెందిన తేలుకుంట్ల చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల అధికారి ఇరుకుల్ల రామకృష్ణ తెలిపారు. రెవిన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్ ను నల్గొండ జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షునిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా, దేవరకొండ మునిసిపల్ చైర్మన్ అలంపల్లి నర్సింహా, పానగంటి మల్లయ్య, ఇరుకుల్ల రామకృష్ణ, మాజీ జిల్లా అధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, చండూరు, నాంపల్లి, మునుగోడు, గట్టుప్పల్, మర్రిగూడ మండల వైశ్య సభ్యులు తేలుకుంట్ల జానయ్య, సముద్రాల వెంకన్న, మంచుకొండ సంజయ్, కర్నాటి శ్రీనివాస్, సోమ నర్సింహా, గట్టు రాజశేఖర్, తాడి శెట్టి సంతోష్, సాగర్, తడకమల్ల శ్రీధర్, మిర్యాల శ్రీను, బిక్కుమాళ్ళ విశ్వనాథం, ఆనంద్ నాగరాజు, సురేష్ భూపతయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సంఘటనలో, నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ కి ప్రజలు, సభ్యుల ఆదరాభిమానాలు మరింత పెరిగేలా చేస్తాయని, ఆయన విజయవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తారని ఉత్సాహం వ్యక్తం చేశారు.



## రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ – 15 ఆటోలు సీజ్

**వారధి న్యూస్, గండిపేట్:** రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ద్వారా 15 ఆటోలు సీజ్ అయ్యాయి. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని దుర్గానగర్ చౌరస్తా వద్ద ప్యాసింజర్ ఆటోలపై ఈ ప్రత్యేక తనిఖీ నిర్వహించబడింది.తనిఖీలలో భాగంగా, చాలా మంది ఆటో డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, అప్రూవ్డ్ లెర్నింగ్ లైసెన్స్‌లు లేకుండా ఆటోలు నడిపిస్తున్నట్లు గుర్తించబడ్డారు. ఈ కారణంగా, 15 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఈ డ్రైవ్‌లో ఆటో డ్రైవర్లకు పలు సూచనలు అందజేశారు. డ్రైవర్లు స్వచ్ఛందంగా లెర్నింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలని కోరారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఎస్సై రాజేందర్, ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ సురేష్, చిరంజీవి, శ్రీనివాస్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## జీవితంలో విజయాల
## సాధనకు విద్యార్థినులు కృషి చేయాలి

- సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

**వారధి న్యూస్, మిర్యాలగూడ:** కష్టంతో కాదు, ఇష్టంతో చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మాలెంపాటీ అన్నారు. మంగళవారం మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో మొదటి సంవత్సరం విద్యార్థినులకు గోల్స్ సెట్టింగ్ అండ్ అచీవ్మెంట్ అనే అంశంపై మాట్లాడుతూ, చదువుపై ధ్యానం పెట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా షీటీం ఆధ్వర్యంలో "సైబర్ నేరాలు మరియు సోషల్ మీడియా ప్రభావం" అనే అంశంపై ప్రేరణ కార్యక్రమం జరిగింది. మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ, విద్యార్థినులు ప్రస్తుత పరిస్థితులలో జరిగే అఘాయిత్యాలను ముందుగానే గుర్తించి, వాటిని పోలీస్ వ్యవస్థకి తెలియపరచాలని కోరారు. డ్రగ్స్ మరియు గంజాయి వంటి మారకద్రవ్యాల ప్రమాదం గురించి కూడా వివరించారు.షీటీం ఎల్లవేళలా సహాయాన్ని అందిస్తుందని, 100 నంబర్ లేదా టి సేఫ్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో సమాచారాన్ని తెలియపరచగలరు అని చెప్పారు. అన్ని వ్యసనాలకు దూరంగా ఉండటం వల్ల సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని వ్యాఖ్యానించారు.ఈ సమావేశంలో కళాశాల చైర్మన్ ఎండి. మహమూద్ అలీ, వన్, టూ టౌన్ సిఐలు కోట కరుణాకర్, పి. నాగార్జున, షీటీం ఏఎస్ఐ తబిత, డైరెక్టర్ షహలాబూతుల్, వైస్ ప్రిన్సిపల్ వాణి, భారతి, పూజ, కరుణాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## కోటి మంది మహిళలను
## కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వారధి న్యూస్, రేవల్లి:** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తెలిపారు. మంగళవారం రేవల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మండల పరిధిలోని 23 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా, మహిళా సాధికారత పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రభుత్వ చర్యలతో మహిళా సంఘాలు బలపడతాయని, త్వరలో ఆర్టీసీ సంస్థలో మహిళా సంఘాలకు ప్రత్యేక పాత్ర ఉంటుంది అని తెలిపారు. మహిళలు ఉచితంగా ప్రయాణించే ఆర్టీసీ సంస్థకు ప్రతి నెల 60 కోట్ల రూపాయల సహాయం అందిస్తుందని మేఘా రెడ్డి పేర్కొన్నారు.ఇంతకు మించి, కొన్ని సాంకేతిక కారణాల వలన రైతులకు రుణమాఫీ పూర్తిగా అందలేదని, రుణమాఫీ పొందని వారు స్థానిక వ్యవసాయ అధికారులతో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే, ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన ఇండ్లను గుర్తించి, వారికి 16,500 రూపాయల ఆర్థిక సహాయం మంజూరుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో, తహసిల్దార్ లక్ష్మీదేవి, ఆర్ఐ శంకర్, ఉమ్మడి మండల ఇంచార్జ్ సత్యశీలరెడ్డి, సింగల్ విండో చైర్మన్ రఘు యాదవ్, రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాడల పర్వతాలు, పార్టీ నాయకులు సురేష్, పెద్ద కురుమతి రెడ్డి, గోవర్ధన్, నారాయణరెడ్డి, శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## రజకుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే మేఘా రెడ్డి**

**వారధి న్యూస్, వనపర్తి:** రజకుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని, వనపర్తి నియోజకవర్గ పరిధిలోని రజకుల సమస్యల పరిష్కారానికి తాను పూర్తి సహకారం అందిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తెలిపారు.మంగళవారం, చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా, ఎమ్మెల్యే మేఘా రెడ్డి మొదటగా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం, వనపర్తి బస్టాండ్ వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద కూడా వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా, రజకులకు కావలసిన దోబి గట్ల ఏర్పాటు, సంఘ భవనాల నిర్మాణం మరియు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు తన పూర్తి కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రజకులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందిస్తారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ ZPTC వెంకటయ్య, ఖిల్లా ఘనపురం సింగిల్ విండో డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి చరణ్ రెడ్డి, వనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, రజక సంఘం సభ్యులు జీజే శ్రీనివాసులు, సత్యాశీల రెడ్డి, పట్టణ ప్రముఖ వైద్యులు పగూడాల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్స్ నక్క రాములు, భాష నాయక్, సత్యం సాగర్, విభూది నారాయణ, శరవంద శ్యామ్ కుమార్, వినోద్ గౌడ్, కూరగాయల రవి, షఫీ, చుక్క రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలనను గాలికి వదిలేసిన ప్రభుత్వం

- సిపిఎం నేత రొండి శ్రీనివాస్ విమర్శ

**వారధి న్యూస్, మాడుగులపల్లి:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో రెండు మాత్రమే నామమాత్రంగా అమలవుతున్నాయని, రైతు రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం, నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని ఇసుక బాయిగూడెం గ్రామంలో సిపిఎం శాఖా మహాసభలు నిర్వహించగా, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన తర్వాత వాటిని నెరవేర్చలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో రెండు మాత్రమే నామమాత్రంగా అమలవుతున్నాయని, రైతు రుణమాఫీ పేరుతో ఆహార భద్రత కార్డును మోసంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. రైతులు రెండు లక్షల రుణమాఫీ కోసం వ్యవసాయ కార్యాలయం, రెవెన్యూ ఆఫీసు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు. బ్యాంకర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని, రెండు లక్షల పైబడి రుణం ఉన్న రైతులను డబ్బులు చెల్లించమని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, అలాగే రెండు లక్షల లోపు మాఫీ వచ్చిన రైతులను కూడా వడ్డీల పేరుతో కొత్త రుణం ఇస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవస్థకు ప్రభుత్వం నుండి ఎలాంటి కట్టడి లేనందున రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రొండి శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన రెడ్డి, సభ్యులు ముల్లాల కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, తెనాలి గోపాల్ రెడ్డి, వనమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా పేరుతో హైడ్రామా

- రుణమాఫీ ఆందోళనలను పక్కదారి పట్టించేందుకే..
- జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

**వారధి న్యూస్, వనపర్తి:** బీజేపీ వనపర్తి జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో నిర్వహించబడింది. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన తల్లోజు ఆచారి, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నదని, ముఖ్యంగా రైతు రుణమాఫీపై ప్రజల ఆందోళనలను పక్కదారి పట్టించేందుకు "హైడ్రా" పేరుతో హైడ్రామా నడిపిస్తున్నారని విమర్శించారు. "రుణమాఫీ కోసం రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది రైతులు చనిపోయారు. ఇలా జరిగే పద్ధతి పూర్తిగా నిష్ప్రయోజనంగా మారింది," అని ఆయన అన్నారు. సిపిఎం నాయకుడు తల్లోజు ఆచారి, ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుటుంబీకులను కలిసిపోయి కొన్ని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి సెటిల్మెంట్ చేసుకుంటున్నారని, ఇప్పుడు అదే విధంగా రేవంత్ రెడ్డి కూడా కొన్ని నిర్మాణాలను కూల్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాక, సీపీఐ (ఎం) ఆరోపించటానికి ముఖ్యమైన అంశమేమిటంటే, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వంటి నాయకులు తమ పార్టీ మారిన ఎమ్మెల్యేల పై ఏం చర్య తీసుకుంటున్నారో తెలియజేయాలని బీజేపీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, జిల్లా సభ్యత్వ ఇంచార్జి ఆర్. లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మరియు బీజేపీ నాయకులు ఇతరుల పాల్గొన్నారు.



# ముంబైలో గ్రాండ్‌గా రిలీజైన 'దేవర' థియేట్రికల్ ట్రైలర్

మ్యాన్ ఆఫ్ మాసెస్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. అభిమానులు సహా అందరూ ఎంతో ఆతృతగా ఈ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్ , యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ ఆర్.రత్నవేలు, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు శిరిల్ వంటి స్టార్ టెక్నీషియన్స్ ఈ చిత్రానికి వర్క్ చేస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటించారు. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి విడుదలైన మూడు సాంగ్స్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం మేకర్స్ 'దేవర' మూవీని థియేట్రికల్ ట్రైలర్‌ను ముంబైలో ఘనంగా నిర్వహించారు. నిర్మాత కరణ్ జోహార్, అనిల్ తడాని సహా పలువురు ప్రముఖులు వేడుకకు హాజరయ్యారు. 2 నిమిషాల 35 సెకన్లున్న ఈ ట్రైలర్ మాస్ ఎలిమెంట్స్ ప్యాక్డ్‌గా ఉంది. ఎన్టీఆర్ అభిమానులకు, యాక్షన్ మూవీ లవర్స్ కోరుకునే అంశాలతో నిండి ఉంది. ఈ మూవీ కోసం దర్శకుడు కొరటాల శివ క్రియేట్ చేసిన ప్రత్యేకమైన ప్రపంచం, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయి. ట్రైలర్‌ను గమనిస్తే ప్రకాష్ రాజ్ గంభీరమైన వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. తీరప్రాంతంలో ఎలాంటి భయాలు లేని ప్రజలు నివసిస్తుంటారు. అక్కడ ఉండే భైరా (సైఫ్ అలీఖాన్) ఓ క్రూరమైన గ్యాంగ్‌తో ఆకృత్యాలకు పాల్పడుతుంటాడు. ఆ ముఠా అక్కడకొచ్చే ఓడలను దోచుకోవటమే కాకుండా, కోస్ట్ గార్డులను కూడా చంపేస్తూ రక్తపాతాన్ని సృష్టిస్తుంటారు. ఇలాంటి కొంత మంది కరుడుగట్టిన గ్రామస్థులకు భయాన్ని పరిచయం చేస్తాడు 'దేవర' (ఎన్టీఆర్) . ఆ గ్రామాన్ని పెను ప్రమాదం నుంచి రక్షించే పవర్‌ఫుల్ పాత్రలో ఎన్టీఆర్ పాత్ర మనకు పరిచయం అవుతుంది. ఎన్టీఆర్ స్క్రీన్ ప్రెజన్స్, అద్భుతమైన డైలాగ్ డెలివరీ, ఆశ్చర్యపరిచే ఎలివేషన్ సన్నివేశాలలతో ఉన్న ఈ ట్రైలర్ అందరిలో సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచుతోంది. ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. భయానికి అర్థం చెప్పే ప్రతిరూపమైన పాత్ర ఒకటైతే.. భయపడుతూ ఉండే మరో పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నారు. భైరా అనే అనే భయంకరమైన పాత్రలో సైఫ్ అలీఖాన్ కనిపించారు. ఎన్టీఆర్, సైఫ్ మధ్య ఉన్న సన్నివేశాలను చూస్తుంటే సినిమా నెక్ట్స్ లెవల్ అనేంతగా అంచనాలు పెరిగిపోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 27న దేవర చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.



# అక్టోబర్ 12న 'జనక అయితే గనక'

వెర్సటైల్ యాక్టర్ సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. వెర్సటైల్ యాక్టర్ సుహాస్ హీరోగా నటించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరక్ట్ చేశారు. ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. దసరా సందర్భంగా 'జనక అయితే గనక' చిత్రాన్ని అక్టోబర్ 12న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇంట్రెస్టింగ్ వీడియో క్రియేట్ చేసి రిలీజ్ చేశారు. వీడియో గమనిస్తే..'జనక అయితే గనక' ఓవర్‌సీస్ హక్కులు సొంతం చేసుకున్న హీరో సుహాస్‌కి అందరూ ఫోన్ చేసి సినిమా రిలీజ్ డేట్ ఎప్పుడని అడుగుతుంటారు. వీరి గోల భరించలేక.. నిర్మాత దిల్ రాజుకి సుహాస్ ఫోన్ చేసి రిలీజ్ డేట్ గురించి అడగటం.. ఆయన దానికి మాట్లాడుతూ మన సినిమా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్ కాబట్టి దసరా సందర్భంగా అక్టోబర్ 12న 'జనక అయితే గనక' చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు తెలియజేశారు. ఈ సంభాషణను ఫన్నీగా ఉంటూనే.. రిలీజ్ డేట్ అక్టోబర్ 12 అని రిజిష్టర్ అయ్యేలా ఉంది.



# కథరీన్ బర్త్ డే స్పెషల్ పోస్టర్

టాలీవుడ్ కు పలు సూపర్ హిట్ చిత్రాలను అందించిన టాలెంటెడ్ డైరెక్టర్ వీఎన్ ఆదిత్య కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను ఓ. ఎం. జీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై, ఏయు & ఐ సమర్పణ లో డాక్టర్ మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో బ్యూటిఫుల్ హీరోయిన్ కేథరీన్ ట్రెసా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ రోజు కేథరీన్ ట్రెసా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విశెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో కేథరీన్ ట్రెసా అందంగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలతో స్ట్రాంగ్ కంటెంట్ తో ఈ సినిమాను దర్శకుడు వీఎన్ ఆదిత్య రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఎంతోమంది దేశ, విదేశాల కొత్త నటీనటులకు అవకాశం కల్పిస్తున్నారు. అమెరికన్స్, స్పానిష్ పీపుల్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్, తమిళ్, కన్నడ, తెలుగు ఆర్టిస్టులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ సినిమాను యూఎస్ లోని డల్లాస్‌లో చిత్రీకరిస్తారు. త్వరలో ఈ థ్రిల్లర్ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు.